UNIVERSAL
LIBRARY
OU_204001
UNIVERSAL
LIBRARY

# మౌలానా ఆజాద్

## రామ్‌ఘర్ కాంగ్రెసు.

కొమాండూరి శఠకోపాచార్యులు,
ఎం. ఏ., బి. ఎల్., కాకినాడ.

ప్రకాశకుడు : కొ. శఠకోపాచార్యులు,
వకీలు, కాకినాడ.

సర్వస్వామ్యసంకలితము.

1940 మార్చి
మొదటికూర్పు.

కాకినాడముద్రాక్షరశాల,
కాకినాడ.

వెల రు 0-6-0.

# పీఠిక.

మౌలానా ఆజాదుగారి జీవితచరిత్ర పవిత్రమైనది. శాంతి, అహింసాభావము, ధార్మికత, వినయము, సాంఘికమైత్రి, జాతీయైక్యము, ఈమహనీయునిలో మూర్తీభవించినవి.

ఈయనచేసిన ప్రజాసేవ అపారము. ఈయన ఇప్పటి తక్కిన ముస్లిమునాయకులకన్న చాలరెట్లెక్కువ పండితుడు ధర్మనిష్ఠుడు; అయినను మతమూర్ఖతకు లోబడలేదు. "ఈదేశపు 'మహమ్మదీయులకు ప్రతిపక్షులు విరోధులు బ్రిటిషుసర్కారు కారు, హిందువులే," అను సర్ సయ్యద్ అహమ్మద్ గారి వాదమును అజాదుగారు ఆబాల్యమును ప్రతిఘటించినారు.

తనకన్న పెద్ద విద్వాంసుడు అగు మౌలానా మహమ్మదాలీగారు 'కామ్రేడు' పత్రికద్వారా అప్పుడు ముస్లిముల ఆ సాంఘికతత్వమునే ప్రేరేపించెను. విదేశమందు పుట్టిపెరిగినను అజాదుగారప్పుడు (1912—15) తన 'అల్ హిలాల్' పత్రిక ద్వారా ద్వంద్వయుద్ధముచేసి, జయించి, జాతీయభావమును ఔదార్యమును ముస్లిములలో (తుదకు మహమ్మదాలీగారిలో గూడ) నాటించెను; ఒకసారి యొకప్రతికక్షి తనను చంపబోయెను; కాని ఆయన తనధర్మబోధను విడనాడలేదు.

ఇప్పుడు మరల భారతదేశము రెండుఖండములుగ జేయుటకు హిందూముస్లిములమధ్య మైత్రిచెడగొట్టి, దేశపు

దాస్యబంధము బలపర్చుయత్నము జరుగుచున్నది. సర్వమాన్యుడుగనున్న అజాదుగారినిప్పుడు రాష్ట్రపతిగ ప్రజలెన్నుకొనుట సహజమే. కొన్నియేండ్లక్రిందనుండి నాయకులు కోరుచున్నను, ఈయన ఇంతవర కధ్యక్షతనుండి తప్పించుకొన్నారు; ఆజాదుగారు నిరాడంబరజీవి. ఈదేశపు క్లిష్టపరిస్థితినిబట్టి ఇప్పుడీబాధ్యత వహించినారు.

గాంధి నెహ్రూల సుభాసులవలె అజాదుజీవితము జనులందరు చదువదగినదని తలచి, ఈచిన్నపుస్తకమును వ్రాసినాను. మౌలానా అజాదుగారు తనజీవితవిశేషములను వెల్లడిచేయుడు. ఆయన తన స్వభాషయగు హిందూస్తానీలోనే గ్రంథములను పత్రికలను ప్రచురించెను; ఉర్దూలో నవ్యశైలికి మార్గదర్శకుడైనాడు. కాని, జనులకాయన జీవితవృత్తాంతములంతగా తెలియవు. కనుక, ఈపుస్తకము వ్రాయుటలో కొంత చిక్కు కల్గినది. అయినను, బొంబాయి క్రానికిల్ పత్రికలోను కొన్ని హిందీరచనలోను దొరికిన అంశములనుపయోగించి దీనిని వ్రాసినాను.

హిందుస్తానీలో 'ఆజాద్' అనియే వీరిపేరు నామక: (దీనికి 'స్వతంత్రుడు' అనియర్థము.) తెలుగులో 'అజాదు' అనియే వాడుక యేర్పడినది. దీనిలో రెండురూపములును పడినవి.

రామఘురుకాంగ్రెసు వృత్తాంతములు రాష్ట్రపతి అధ్యక్షోపన్యాసముకూడ ఇందులో చేర్చబడినవి.

కాకినాడ
30-3-40.

కొ॥ శ॥

# విషయసూచిక.


| అధ్యాయము. | విషయము. | పుట. |
|---|---|---|
| 1. | ఉపక్రమము | 1 |
| 2. | బాల్యము. | 4 |
| 3. | విద్యాభ్యాసము. | 5 |
| 4. | పత్రికాసంపాదనము | 8 |
| 5. | ఖిలాఫతు ఉద్యమము | 21 |
| 6. | అసహాయోద్యమము. | 24 |
| 7. | ఢిల్లీ కాంగ్రెసు అధ్యక్షత. | 30 |
| 8. | సత్యాగ్రహము, జైలు | 34 |
| 9. | కాంగ్రెసు పార్లమెంటరీ బోర్డు. | 41 |
| 10. | కాంగ్రెసు అధ్యక్షత | 45 |
| 11. | రామఘుర్ కాంగ్రెసు | 53 |
| 12. | ఆజాదుగారి స్వభావము | 60 |
| 13. | అధ్యక్షోపన్యాసము | 67 |



రాష్ట్రపతి ఆజాద్‌గారిని రామఘర్‌లో

సన్మానించుట.

# రాష్ట్రపతి మౌలానా ఆజాద్.

## 1. ఉపక్రమము.

మన నాయకులకు ప్రజాసేవకులకు లభించు గౌరవము లన్నిటిలో గొప్పది కాంగ్రెసు అధ్యక్షత. ఈకాలమందు ఆర్థిక సాంఘికాదులకును రాజకీయములతో సంబంధమున్నది; కనుక, ప్రజాక్షేమమునకై కృషిచేయు మనదేశపు సంఘములన్నిటిలో ముఖ్యము జాతీయమహాసభయే. త్యాగముతోను దేశసేవ తోను ధన్యులైన పవిత్రపురుషులే జనులహృదయ మాకర్షించి, వారి యెన్నికచే కాంగ్రెసు కధ్యక్షులుకాగలరు.

ఈ సాలు కాంగ్రెసుమహాసభకు శ్రీ మౌలానా అబుల్ కలాం అజాదుగా రధ్యక్షులైనారు. ఈయన గొప్పత్యాగి, మహాభక్తుడు, అద్భుతవిద్వాంసుడు, సౌమ్యుడు, వినమ్రుడు, సమన్వయకర్త. ఈ వీరపురుషుడు విదేశజాతుడయ్యు, భారత మాతకు నిజమైన పుత్రరత్నములలో నొకడు; అరబ్బీ పారసీ ఉర్దూలలో నఖండపండితుడై, మనదేశీయసంస్కృతిపైన విశే షాదరముగలవాడు. ముస్లిము ధార్మికలోకమందు సాటిలేని విద్వాంసుడై జగద్విఖ్యాతుడైనను, తనలో శతాంశమునకును పోలని నాయకమ్మన్యుల గర్వోక్తుల కెమరాడక, విరోధులకును

పూజ్యుడగు అజాతశత్రువు; సర్వదా వేదాంతగోష్ఠిలో నుండి ధార్మికవీరుడై దైవభక్తుల కాదర్శపురుషుడయ్యు, రాజకీయము లందు నిరంతరకర్మపరుడు; అద్భుతవాగ్ధాటిగల మహావక్త యయ్యు, అత్యంతం మితభాషి; విశ్వజనీన దృష్టిగల్గియు, అఖండ దేశభక్తుడు. రామఘరకాంగ్రెసు జరుగబోవు ముందాయన యిచ్చిన యీక్రింది సందేశము గమనింపుడు.

"భారతదేశపు రాజకీయసమరములో నిప్పుడు గొప్ప విషమమగు ఘట్టములోనుండి వెళ్ళుచున్నాము. మనకాలపు ఈఅగ్నిపరీక్షలో జయమొందుటకు ఈక్రింది ముఖ్యాంశములు రెండును కాంగ్రెసు పక్షీయులగు స్త్రీ పురుషులందరూ స్మరింపవలెను. మనమహాసంస్థ సరిగ తయారై, అంతఃకలహములు పోయినప్పుడే, రాబోవు ఎట్టిపరిస్థితులనైన శక్తిగాంభీర్యములతో సాధింపగలము. కాంగ్రెసును జాతీయస్వాతంత్ర్యమును అభిమానించువారెవరును మనఐక్యముకు సమిష్టి కార్యపరత్వముకు భంగకరమగునట్టిమియు చేయకూడదు. మనలోని అల్పత్వమును వదలి, మనయున్నతికేర్పడిన యీవిషమస్థితిలో నిజమైన భారతయోధులము కావలెను; మనమాటలు చర్యలు గంభీరములై ఉదారములై యుండవలె, గాంధిమహాత్ముని నాయకత్వమందు సంపూర్ణవిశ్వాసముంచవలె. ఈనాయకత్వమువల్లనే మనయుద్యమమిట్టి ఘనస్థితివచ్చియున్నది; దీనిద్వారానే ముందును మనము విజయమొందగలము."

ఇట్టిమహనీయుని జీవితచరిత్రము జనులందరికి మార్గదర్శకము. కాని, వినయమూర్తి, ఖ్యాతిద్వేషియగు మౌలానా గారు తమ్మునిగూర్చి వ్రాయుట చెప్పుట లేదు, కనుక వివరములు సరిగా తెలియవు, కాని, ఆజీవితపు ముఖ్యవిశేషము లందరును గ్రహించి, అనుసరింపదగినవి; కనుక వాటిని పరిశీలింతము.

అజాదుగారి పూర్వీకులందరును ధర్మశాస్త్రజ్ఞులు,మహావిద్వాంసులు. మూలపురుషుడగు షేక్ జమాలుద్దీనుగారు మహాపండితుడు, మతాచార్యుడు. ఆయన భారతదేశమునకు వచ్చి, అక్బరుచక్రవర్తి యాస్థానపువిద్వాంసుడుగ నుండెను. ఆయన వంశస్థులు ముస్లింమతాధికారులుగ నుండిరి. వారీదేశమునుండి తరుచు అరేబియాకు పోవుచుండిరి. అజాదుగారితండ్రి తాతలు భారతీయులే అయితే 1857 లో జరిగిన సిపాయివిప్లవసమయమందు ఢిల్లీ అల్లకల్లోలస్థితిలోనుండెను. అప్పు డజాదుగారి తండ్రి యీదేశమునుండి అరేబియాకు వెళ్ళెను. ఆయన మహావిద్వాంసుడు, ధార్మికుడు, కనుక టర్కీసుల్తానుగా రాయనను పిలిపించి, కొన్నియేండ్లు తమరాజధానిలో నుంచుకొనిరి. ఆయనకాలువ యేర్పాట్లువగైరా ప్రజోపయోగకార్యములును అరేబియాలో చేయించెను.

# 2. బాల్యము.

మౌలానా అబుల్ కలాంగారి అసలుపేరు అహమ్మదు ఈయన తండ్రి మదీనాలో నొకసుందరిని పెండ్లాడెను, కనుక ఈయనతల్లి మాత్రం అరబుయువతి. ఆమె కీయన క్రీ. శ. 1888 సెప్టెంబరులో అరేబియాదేశపు మెక్కాలో జనించెను. ముస్లిం మతస్థాపకుడగు మహమ్మదుగారు క్రీ. త. 7 వ శతాబ్దిలో జీవించిరి ఆయనయు మెక్కాలోజనించి, అరేబియాలోనే తనజీవితమంతను గడపి, దుస్థితిలోని స్వజాతి నుద్ధరించి, మహోత్సాహులగు వీరజాతిగజేసి, 622 లో మరణించిరి. మహమ్మదు వారి మతోపదేశములన్నియు అసలు అరబ్బీభాషలోనే చేయబడెను. ముస్లింమతమేర్పడుటకు పూర్వమును ఆప్రాంతమున మెక్కాపుర మొక వ్యాపారకేంద్రము, గొప్పతీర్థస్థలము. అరబ్బులు మెక్కాలో 'కాబా' అను శిలాప్రతిమను గొప్ప అమ్మవారుగభావించి, మక్కాను యాత్రాస్థలముగ నెంచిరి; మహమ్మదు వారిలో మూఢత్వము పోగొట్టుటకు విగ్రహారాధనను మాన్పించెను; కాని, 'ధర్మసమన్వయము'గ మక్కాపురి యాత్రాస్థలముగ యుండునట్లంగీకరించెను. ఆయనతరువాతను, మక్కానగరము అనేక ముస్లింధార్మిక ప్రచారకుల యావాసమైనది. కనుక, నేటికిని, (హిందువులకు కాశీపురివలె) మహమ్మదీయ ప్రపంచ మంతటికిని ఈనగరము అతిపవిత్రము.

అబుల్ కలాంగారు బాల్యమంతయు ఆదేశంలోనే గడపి, అక్కడి ఆచారములను సంప్రదాయములను చక్కగా నేర్చుకొనెను; చిరకాలాగతమగు పురాణగాథలన్నిటిని గ్రహించెను. విశాలమగు స్వతంత్రభావముల నలవర్చుకొనెను.

# 3. విద్యాభ్యాసము.

తగిన ఉపపత్తిలేకయు, స్వతంత్రుడగుటవల్లను, బాల్యములో 'అజాదు' ఏబడిలోను చదువుకోలేదు. ('అజాదు' అనగా స్వతంత్రుడు అని శబ్దార్థము) కాని తండ్రివద్దనే తనంతట విద్య నేర్చుకొనెను; అతనికి జ్ఞానాశక్తి బాల్యంలోనే అంకురించినది. అతడు మేధావియై తనకు దొరికినగ్రంథముల దీక్షతో చదువుచు, అందలిసారమును గ్రహించుచుండెను. క్రమంగా జ్ఞానాభిలాష హెచ్చి, అతడు పిమ్మట ఉన్నతవిద్యకై ఈజిప్టుదేశ మందలి కైరోకు చేరెను. ఈజిప్టు ఆఫ్రికాలో ఆగ్నేయదిశనున్నది. దీనినే మిశ్రదేశమందురు. ఇందలిప్రజలు చాలవరకు మహమ్మదీయులు. రెండువేలయేండ్లక్రింద అక్కడి నైలునదీతీరమందు గొప్ప విద్యాకేంద్రములుండెను. ఇప్పటి ముస్లిముదేశములలో ఈజిప్టు ఎక్కువసారవంతము, ఫలవంతము. అది మన భారతదేశమువలె మహానదియుతమై, గొప్ప ప్రాచీననాగరికత గల్గినది. ఆదేశపు రాజధాని 'కైరో'. అదినైలునదీతీరమందున్నది. అక్కడ 'అల్ హాజరు' అను గొప్పవిశ్వవిద్యాలయ మున్నది. అది మహమ్మదీయవిద్యాసంస్థలన్నిటిలో గొప్పది, ఎక్కువ ప్రసిద్ధమైనది. ముస్లింసంస్కృతిబోధ కదియే కేంద్రస్థలము. అజాదు ఆవిశ్వవిద్యాలయంలో ఉన్నతవిద్య నభ్యసించెను; అక్కడ నతడు ముస్లింమతముకు తత్వశాస్త్రముకు పాశ్చాత్యవిజ్ఞానము

కును సంబంధించిన గ్రంథములన్నిటిని అత్యాతురతతో నభ్యసించెను, ఆయువకుని జ్ఞానకాంక్షకు మితిలేదు; ఆతడు కుశాగ్రబుద్ధి. ఆవిశ్వవిద్యాలయమును వదలునాటికి తనకు 15 ఏండ్ల వయస్సు. అయినను, అప్పటికే ఆతడు ముస్లింవిద్వాంసులలో ప్రముఖుడై, గొప్పతత్వజ్ఞుడని పేరునొందెను.

కైరోలోనున్నప్పుడే, ఆతనిలో స్వాతంత్ర్యబీజము నాటుకొన్నది. ఈజిప్టు మొదటస్వతంత్రదేశము, కాని అది దరిమిలాను 'తుర్కీ' సామ్రాజ్యములో భాగమైనది. అయితే ఇటీవల తుర్కీసుల్తాను దుర్బలుడైనాడు. ఈసంగతిని ఈజిప్టులో మంచిపత్రివగైరాలు పంపుటను కనిపెట్టి, పాశ్చాత్యులలో బ్రిటిషుఫ్రెంచివారలక్కడ చేరిరి. నెపోలియను యుద్ధానంతరము, బ్రిటిషువారు తమ పలుకుబడి నక్కడవృద్ధిజేసుకొనిరి; మనదేశములోవలె, ఆదేశీయులలోను ఆయాసంఘములమధ్య కొద్ది కలతలుంటే, అవి పెరుగుటకు తాము తోడ్పడిరి; తుర్కీ సామ్రాజ్యపు అధికారము నామమాత్రమైనది. కొంతకాలము కీజిప్టురాజగు 'ఖెడివు'ను బ్రిటిషువారు తమచేతి కీలుబొమ్మగ జేసుకొనిరి. అక్కడి ప్రజానాయకుడగు జగ్లులుపాషా జనులలో జాతీయభావము కల్గించి, ఆయాసంఘములమధ్య ప్రేమభావమును ఐకమత్యమును వృద్ధిజేయ కృషిచేయుచుండెను. కాని, బ్రిటిషుసామ్రాజ్యపాలకులు మనదేశములోవలె ఈజిప్టులోను విభజించి పాలించుపద్ధతి నవలంబించిరి. అక్కడను కాప్టులు

మున్నగు కొన్ని అల్పసంఖ్యాకసంఘములున్నవి. వాటిరక్షణకై తా మక్కడనుండుట అవసరమని బ్రిటిషువారు ప్రచురించు చుండిరి. బ్రిటిషురాజనీతిలోని యీామ స్తంత్రమును, జాతీయతా వృద్ధికై జగ్లులుపాషాగారు చేయుకృషిని, జాతీయరక్షణకు జనులంనైక్య మత్యవసరమనియు, బాలుడై నను అజాద గ్రహించెను; ఇట్లు అజాదు స్వాతంత్ర్య ప్రేమిమైనాడు.

ఆతని తండ్రి అనేక మతగ్రంథములురచించి, వాటి నప్పుడు ఈజిప్టులో నచ్చువేయించెను. కాని, కొడుకు తనకన్న ఘనుడని స్పష్టమైనది. అబుల్ కలాం 15 ఏండ్ల వయస్సుననే కైరోలో బోధకుడై నాడు; మహావిద్వాంసులతో అద్భుతమగు శాస్త్రార్థ చర్చ సాగించినాడు; ముస్లింమతాచారముల అసలు స్వభావమును, అవసరమైన సంస్కరణలను, ధైర్యముతో చర్చించెను; లిసానల్ సిద్క్ అను సాహిత్యకమైన మాసపత్రిక నారంభించెను. అందాయన యప్పుడు వ్రాసినవ్యాసముల అద్భుతభావములు హాలీ, మౌలానాశిబ్లి మొదలగు ఆనాటి మహా పండితులకును ఆశ్చర్యము గల్గించెను; 1904 లో బొంబాయి వచ్చి, విద్వాంసులతో చర్చ జరిపి, మరల నాతడీజిప్టుచేరెను.

# 4. పత్రికాసంపాదనము.

పిమ్మట అజాదు స్వదేశమగు భారతభూమికి చేరుటకాతురపడి, అంతటితో విద్యాకృషిని నిల్పుచేసుకొని, తండ్రితో హిందూస్థానము చేరెను; ఆయన వెంటనే తండ్రితాతల వాసస్థలమగు ఢిల్లీలో కాపురముపెట్టెను. ఆయనకు జీవనములో సహాయము చేయువారంతగా లేరు; ఈదేశీయులు తనకు క్రొత్త. కాని, అబుల్ కలాం మహాధీరుడు, ఉత్సాహి, త్యాగి, దేశాభిమాని. అప్పుడు మనదేశమందును జాతీయభావము విద్యాధికులలో నారంభించెను. అజాదుగారు వార్తాపత్రికలద్వారా సంఘసేవ చేయనిశ్చయించెను. అప్పుడు పంజాబురాజధానియగు లాహోరులో 'వకీలు' అను ఉర్దూవారపత్రికయుండెను. దానికాయన వ్యాసములు వ్రాయుచు, కొంతకాలము దాని సంపాదకుడైయుండెను; కాని, స్వేచ్ఛతో తన స్వతంత్రభావముల బ్రచురించుటకు ప్రత్యేకపత్రిక తనకుండుట యవసరమని గ్రహించి, అజాదు కలకత్తా వచ్చి, 1912 లో అక్కడనుండి 'అల్ హిలాల్' అను ఉర్దూపత్రిక నారంభించెను. ఆయన సాంఘికనైతికరాజకీయములన్నిటిలోనుఉన్నతమైన ఉదారభావము లీపత్రికద్వారా వెలువర్చుచుండెను; సంఘమందలి దురాచారములను మూఢభావములను, అబుల్ కలాము ధైర్యముతో ఖండించుచుండెను. ముస్లిం సంఘములో చాలమంది గాఢముగ దైవభక్తిగల్గినట్లు

తోచినను, వారును హిందువులవలె చాలవరకు బాహ్య వేషము సంప్రదాయపు ఆచారములు అవలంబించుటతోనే తృప్తినొందుచున్నారు. నిజమైన ధార్మికభావములను అసలు తమతమ ప్రవక్త లుద్దేశించిన సదాచారములను హిందువులు ముస్లిములుగూడ మరచినారు. కనుక పరిశుద్ధభావములెట్టివో, ఏవి సంఘక్షేమకరమైన సదాచారములో, శాస్త్రనిరూపణతో చర్చించి, ఆజాదుగారు అద్భుతమైన బుద్ధికుశలతతోను, పరిజ్ఞానముతోను విశదపర్చిరి. తిలకు, అరవిందుడు మాలవ్య, రాధాకృష్ణాదులు హిందూధర్మమునకు చేసినసేవ నిప్పుడు అబుల్ కలాము ముస్లింధర్మమునకు చేసెను; జాతీయభావమును స్వాతంత్ర్యాభిలాషను నిజమైన ధార్మికోత్సాహమును గల్గించుచు ప్రతిసంచికలోను చక్కని వ్యాసములు వ్రాయుచుండెను. ఆయన ఉర్దూలో సవ్యమగు అద్భుతశైలి నేర్పర్చెను; అది పటుత్వము, మాధుర్యము గల్గి, ఆకర్షకమై యుండెను. కనుక 'అల్ హిలాల్' కొద్దికాలములోనే ఉర్దూవారపత్రికలలోనెల్ల ప్రముఖమైనది.

ఈసందర్భంలో ఈదేశపు ముస్లిముల జాతీయస్థితిని మనము కనిపెట్టవలసియున్నది. మొగలులకాలమునాడు ఈ దేశంలో చాలభాగము ముస్లింరాజుల పాలనలోనుండినసంగతి అందరికిని తెలిసినదే. మొగలుసామ్రాజ్యము భగ్నమైనమీాదట, మహారాష్ట్రరాజపుటానాలలో హిందూరాజ్యములు, పంజాబులో సిక్కురాజ్యములు, ఏర్పడినవి. కాని, దక్కను, అయోా

ధ్య, బెంగాలు ప్రాంతములలో నవాబులే తరువాతగూడ రాజ్యము సాగించినారు పిమ్మట, అందరును బ్రిటిషువారికి వశులైరి. ఈముస్లింరాజులలో కొందరు స్వమతమును విశేషముగ వ్యాపింపజేసిరి. అందువల్ల ఉత్తరహిందూదేశములో చాలమంది హిందువులు మహమ్మదీయులైనారు. ఇప్పుడు ఈదేశపు జనులలో నాల్గవవంతు మహమ్మదీయులు. బ్రిటిషుప్రభువులు పాలితులలో విభేదము కల్పించుటలో దిట్టలు. మహమ్మదీయులకు హిందువులకు కలతలుంటే, వారికిలాభము. ముస్లిములెప్పటికైనను తిరుగబడి స్వరాజ్యము స్థాపింపబూనుదురేమోయని భయమున, వారు మొదటముస్లిములకన్న హిందువులకే ఎక్కువప్రోత్సాహమిచ్చిరి. కాని, తరువాత ముస్లిములును నిర్వీర్యులై నిర్వీణ్ణులైరి; హిందువులలోనే కొందరు బ్రిటిషుబంధమునుండి దేశమును స్వతంత్రముగ జేయవలెనని గోణుగుట కారంభించిరి. ఈధోరణిని జూచి, బ్రిటిషువారీసారి ముస్లింప్రముఖులను చేరదీసినారు; తాము ముస్లిములుమున్నగు అల్పసంఖ్యాకులకు ప్రత్యేకరక్షణ నిచ్చి వారి నుద్ధరింతుమని సూచించిరి; ముస్లిములు తమ ప్రత్యేకసంస్కృతిని కాపాడుకోవలెనని, హిందూప్రాబల్యముకు లోబడకూడదని, సంజ్ఞ చేసిరి. అంతట కొందరు ముస్లింప్రముఖు లాతంత్రములో బడిరి. ముస్లింహిందూ మతములు కేవలం వ్యతిరిక్తములని, ముస్లిములు స్వమతాచారములకు అరబు సంప్రదాయములకు ప్రాముఖ్యమీయవలెనని,

ఎంచిరి. వీరిలో ముఖ్యుడు సయ్యద్ అహమ్మద్‌ఖాన్. ఈయన 'అలీఘరు'లో ముస్లిములకు ప్రత్యేకకళాశాల నేర్పరచి, బ్రిటిషుప్రభుత్వపు సాయముతోను బ్రిటిషుబోధకుల యాజమాన్యముతోను దానిని వృద్ధికి తెచ్చెను. ఇందు ముస్లిముమతముతోబాటు, పండుగలలో గోవధకు, మసీదులయెదుట సంగీతాదుల బహిష్కారమునకు, అరబ్బి పారసీభాషలు పారసిలిపి ఫెజ్‌టోపీ పైజామాలు మున్నగు ప్రత్యేకవేషభాషలనే ముస్లిములు వాడవలెనను సంప్రదాయమునకును, ప్రత్యేక ప్రాముఖ్యమిచ్చిరి; హిందూమతాచారములవ్యాప్తి హిందూసంఘటనోద్యమము మహమ్మదీయమతమునకు హానికరములని ప్రచారము జరిగినది. బ్రిటిషుప్రభుత్వమే ముస్లింసంస్కృతికి రక్షకమనియు కొందరు బోధించిరి. ఈకళాశాలలో తయారైన ముస్లిములకు సర్కారుసంస్థలలో నున్నతోద్యోగములు సులభముగ దొరుకుచుండెను. ప్రభుత్వమువారు సయ్యదు అహమ్మదుగారికి సర్‌బిరుదమిచ్చి, గౌరవించిరి; ఇట్లే కలకత్తావగైరాలలోను ప్రత్యేక ముస్లింకళాశాలలు స్థాపితమైనవి. ముస్లింనాయకులజూచి, కొందరు హిందువులును తమ ప్రత్యేకసంస్కృతి వృద్ధికని కాశీవగైరాలలో ప్రత్యేకకళాశాల లేర్పరచిరి. ఇట్లు ఈరెండు పెద్దసంఘములమధ్య సిద్ధాంతములో వేషభాషలలో ఆచారములలోను ధోరణిలోను విభేదకరమైన అంశములకే ప్రాముఖ్యముగల్గి, రెండుసంఘముల ప్రముఖులలో కలతలుపెరుగ నారంభిం

చినవి. విద్యార్థుల పాఠ్యగ్రంథముల పద్ధతియు ఇందు కనుగుణమైన పరస్పరద్వేషమునకు తోడ్పడినది; పరస్పరమైత్రి క్షీణించి అసహనము హెచ్చినది. బ్రిటిషుఅధికారులు ఉద్యోగములిచ్చుటలో, శాసనసభాదుల నియోజకపద్ధతిలోను, ఆయా సంఘములకు ప్రత్యేకతపేరట విభేదము హెచ్చింపజేసిరి. మింటో-మార్లేలు సంస్కరణలలో ప్రత్యేకనియోజకవర్గములపేర విషాంకురముల నాటిరి; మూఢులు అజ్ఞానులు అగువారికి బాహ్యాచారములందే గౌరవము స్వకీయులపైన ప్రత్యేకాభిమానమునుండుట సహజము. విద్యాధికులిట్టి సంకుచితదృష్టిని పోగొట్టి, జనులలో పరస్పరప్రేమను విశాలభావమును గల్గింపవలెను. పూర్వకాలమందు మనదేశములో నట్లే జరిగినది. ఇప్పుడు ఇతరదేశములలో మతద్వేషములు చాలవరకు తగ్గినవి. కాని, ఇక్కడివిద్యాధికులకు పై కారణములవల్ల కులతత్వమేర్పడినది; అందువల్ల వారు పామరులకు మార్గదర్శకులై ఉద్ధరించుటకుబదులు అపసవ్యధోరణి చూపిరి; ఇట్లు 'శతాంధాః కూపం ప్రవిశంతి' అను న్యాయమున అన్నిసంఘములవారును అధోగతిబట్ట నారంభించిరి. ఆర్థికసాంఘికములలో స్వార్థపరతయే మర్యాదయు సంప్రదాయమునైనవి. ఈరెండుసంఘములలో ప్రతివారును బ్రిటిషుప్రభుత్వమును తామే మంచిమాటచేసుకొని, వారికృపవల్ల ఉద్యోగాదిలాభ మొందదలచినారు; కనుక సంఘనాయకులు వారి అనుచరులును 'రాజభక్తి'

పరులగుటలో ఒకరునొకరు మించిరి. ఆహా! పరాధీనుల కాత్మ గౌరవము నశించునుగదా! సంఘమంతటి క్షేమముకోరుటకు బదులు, తమ తత్కాలలాభమే చూచుకొనుట సంప్రదాయ మైనది.

ఈస్థితిలో తిలకు, లజపతిరాయి, అరవిందుడు మొదలగు కొందరు హిందూనాయకులు రాజకీయస్వాతంత్ర్యము కల్గినప్పుడుగాని, దేశము బాగుపడదని నిశ్చయించి, స్వరాజ్యోద్యమ మారంభించిరి. అయితే క్రిందటిశతాబ్దిలోనే బ్రిటిషు ప్రభుత్వమువారు జనులను నిరాయుధులుగ జేసి, శస్త్రము బట్టుట గొప్పనేరమని నిర్ణయించిరి; జనులు పిరికివారైనారు.

ఇక సామాన్యులకు విద్య యసలేలేదు. దేశభాషల ద్వారా వారిలో పరిజ్ఞానము కలుగవలెను. అందుకు వార్తాపత్రికలే ముఖ్యాధారములు, మనదేశంలో ఆంగ్లము తెలిసినవారు సగటుకు నూటికొక్కరుమాత్రముందురు; దేశభాషలో చదువగలవారు నూటి కెనిమిదిమంది. హిందీ బంగాళీ తెలుగు వగైరా స్వమూప్రాంతీయభాషలలో కొన్ని వార్తాపత్రికలు వెలువడి జాతీయతను బోధించదొడగినవి. ఇవి హిందువులలో కొంత యుద్బోధముగల్గించినవి. కాని, ముస్లిముల కట్లుకాలేదు. సర్ సయ్యదు అహమ్మదుఖాను వగైరాలు పెట్టిన సంప్రదాయ ప్రకారం ముస్లిం బాలురు చాలవరకు తమ ప్రత్యేక 'మద్రసా'లలోనే చదువుచు, ఇంటివద్దను ఉర్దునే మాతృభాషగ

నెంచుచు, తమప్రాంతపు దేశభాషలో కృషిచేయుట మానిరి. అందువల్ల, వారు హిందువులు తరుచు చదువు ప్రాంతీయపత్రి కల జదవక, సాంఘికతత్వపు ముస్లింనాయకులు నడుపు ఉర్దూ పత్రికలనే తరుచు చదువు రివాజుకల్గినది. అందువల్ల, వారిలో జాతీయ దృక్పథముకు బదులు అల్పదృష్టియు సాంఘికతత్వ మును విదేశీయులపైన దాస్యభావమునే నాటినవి; బెంగాలు లోను దక్కను హైదరాబాదులోను ఇట్లేజరిగిన సంగతి చాల మంది కనుభవసిద్ధమే. అబుల్‌కలాముగారుమాత్రం ఈజిప్టు టర్కీ అరేబియా పర్షియాదేశములలో దిరిగి, అక్కడనాయకు లతో మాట్లాడి, విశాలహృదయుడై, వారికిని జాతీయతావశ్యకత బోధించినాడు. ఆదేశముల విద్వాంసులాయన యౌదార్యమును శాస్త్రనిపుణత్వమును, సూక్ష్మబుద్ధినిగ్రహించి ఆయనకు 'అమీర్ - ఎ- హింద్' అని బిరుదునిచ్చి గౌరవించిరి. కాని వినయమూర్తియగు అజాదు ఆబిరుదును వాడుటలేదు. అట్టి పరి స్థితిలో ఆజాదుగారు ఉర్దూలో ధైర్యముతో జాతీయపత్రికను నడిపి, సాంఘిక తత్వవాదుల మూర్ఖభావములను తనవ్యాస సములలో గట్టిగ ఖండించెను. మహమ్మదువారిజీవితము నుండియు, అరబుసంప్రదాయమునుండియు, చాల ఉదాహరణ లను ఉపపత్తులను కనపర్చి, మహమ్మదీయమతము ఉదారమని చూపెను. దేశపు దాస్యభావము కామతసిద్ధాంతములు సమ్మ తింపవని, జాతీయస్వాతంత్రముకై కృషిచేయుట, పరస్పరసహా

నము, మైత్రి, శాంతభావము ఇస్లాంమతపు సిద్ధాంతములలో నివేయని, చక్కగ నిరూపించెను. ప్రతివారమును ఆల్ హిలాల్' పత్రికలో వెలువడు వ్యాసములు ఉత్తరప్రాంతపు జనులలో (ముఖ్యముగ మహమ్మదీయజనుల హృదయములో) నవ్యజ్యోతిని వ్యాపింపజేసెను; మాంద్యమును బోగొట్టి, జ్ఞానతేజస్సును జాతీయోత్సాహమును అంకురింపజేసినవి. ఆయనకు ఇస్లాంధర్మ శాస్త్రములందును అరబు సంప్రదాయగ్రంథములందును గల పాండిత్య మఖండము. కులతత్వవాదులు స్వార్థపరులు కూప కూర్మదృష్టితో పత్రికలలోను ఉపన్యాసములలోనూ చేయు సంకుచితమగు కుయుక్తివాదముల నాయన శాస్త్రీయముగ విమర్శించి, పరిశుద్ధసిద్ధాంతముల స్థాపించుచుండెను. అప్పుడా యన పత్రికకు కలిగిన ప్రచారమద్భుతము; అది మనదేశమం దన్ని ప్రాంతాలలోను విదేశములందును వ్యాపించినది.

ఈజాతీయప్రచారము సర్కారువారికి రుచించలేదు; అది సహజమే. ఉద్యోగుల తీవ్రదృష్టి కాయన జంకలేదు; కాని ఆదృష్టి దీనిపై బడి త్రినేత్రదృష్టివలెనైనది. ప్రెసుఆక్టు క్రింద విచారణలేకుండనే ధరావతు తీసుకొనియు; నిషేధించియు, సర్కారు బాధించవచ్చు. అట్లు ఆపత్రిక 1915 లో అణచివే యబడి, నామావశేషమైనది. కాని, అబుల్ కలాం మహాధీరుడు, దృఢసంకల్పుడు; కనుక అది యంతరించగనే, ఆయన 'అల్ బలాగ్' అనుపేర ఇంకొకఉద్దూపత్రిక నారంభించెను; ఇంతలో

1914 లో జర్మనుయుద్ధమారంభించినది. ఆయుద్ధములో ముస్లిం దేశములలో ముఖ్యమైన టర్కీసుల్తాను జర్మనుల పక్షము వహించెను. టర్కీ నణచుటకు బ్రిటిషువారు తీవ్రముగ దాడి సాగించి, టర్కీసామ్రాజ్యపు అరేబియా సిరియాపాలస్తీనువగైరా లలో విప్లవము లేవదీసిరి.† ఆసందర్భములో ప్రభుత్వచర్యలను తక్కిన జాతీయపత్రికలతో బాటు ఆజాదును తీవ్రముగ విమర్శించి ముస్లిములకు స్వాతంత్ర్యేచ్ఛ నుద్బోధించెను.

ముస్లిముల పుణ్యక్షేత్రముల రక్షణార్తై తుర్కీరాజ్య మధికారము గల్గియుండుట అన్నిదేశాల ముస్లిములకు నవసరమని ఆయనయు 'అలీ'సోదరులును నిరూపించిరి. మరియు, అజాదుగారు బ్రిటిషుపాలకుల సామ్రాజ్యతత్వమును నిరంకుశత్వమును నిరసించెను. అంతట, ఈపత్రికకును వెనుకటి 'అల్ హిలాల్'కు పట్టినగతియే కలిగినది. అయినను అబుల్ కలాము జాతీయబోధను మానలేదు; ఆయన దేశమందాయాప్రాంతములందు సంచరించి,జనులకు (ముఖ్యంగా మహమ్మదీయులకు) స్వేచ్ఛను ఉదారతను బోధింపదొడగెను. ఆయన అద్భుత వాగ్ధాటిని అమృత రసప్రవాహమునుగ్రోలి యానందించుటకు ముస్లింజనులు వేనవేలుగ వచ్చుచుండిరి. సర్కారువారాయనను ఢిల్లీకి, పంజాబుకు మద్రాసుప్రాంతముకుగూడ పోకూడదని

---

† ఈసందర్భమున అరేబియావగైరాలలో లారెన్సుగారి చాణక్య చర్యలు లోకప్రసిద్ధమైనది.

నిషేధించిరి. యుద్ధకాలమందు భారతరక్షచట్టమను పేర కొత్త నిబంధనను సర్కారువారు జారీచేసి, ఆప్రకారం నిరంకుశాజ్ఞల ప్రయోగించుచుండిరి. వాటి కీయనయు గురియైనాడు. తుదకాయన తన బెంగాలునే వదలిపోవలెనని హుకుము జారీయైనది. ఇంకెక్కడకు పోవుటకును తోచక, అప్పుడాయన బీహారులోని 'రాంచి' యనుపల్లని గిరిపురిలో మకాంపెట్టుకొనెను. కాని, ప్రభుత్వపుశ్రద్ధ ఆయన సంతతితో వదలలేదు; త్వరలోనే ఆయన నాపురమందే నిరోధించి, పిమ్మట నిర్బంధించిరి. ఇట్లాయన 1916 నుండి 1919 డిసెంబరువరకు ఖైదులోనుండెను. తుర్కీచర్యనుసమర్థించి,ముస్లింమోఘులెవరూతుర్కీతో పోరాడకూడదని చెప్పినందుకప్పుడు అలీసోదరులును బంధింపబడిరి.

ఇట్టిన్ని కష్టములు గల్గినను అబుల్ కలాము భయపడలేదు, నిర్విణ్ణుడుకాలేదు. కాని, ఆయన కారకకూర్చొనలేదు; నిరంతరకార్యపరుడు, ప్రజాసేవకుడు, విద్యావినోది, కనుక నిరోధమందున్నను ఆయన వ్యాసంగముచు మానలేదు. మహానీయులతేజస్సు అంతరాయముల లక్ష్యపెట్టదుకదా! బాలగంగాధరతిలకుగారు 1908 నుండి 1914 వరకు నిర్వాసితుడై మాండలేజైలులో నున్నపుడే స్వభాషలో అద్భుతమైన గీతాభాష్యము రచించి కర్మవీరబిరుదను సార్థకము చేసుకొన్నాడు.† (పరిమిలాను జనాహల్లాలును ఖైదులోనున్నప్పుడే ప్రపంచచరి

† దీనికే లోకమాన్యుడు 'కర్మయోగశాస్త్రం'అని పేరుబెట్టెను.

త్రను ఆత్మకథను రచించెను.) తిలకువలె మహావిద్వాంసుడగు ఆజాదును ఆనిర్బంధకాలములో ఆధ్యాత్మికరచనకే తనకాలము వినియోగించెను. తాను ముస్లిముల ధార్మికవాఙ్మయములో అగాధపరిశ్రమ జేసినాడు, కనుక రాంచిలో 3 ఏండ్లలో ముస్లిముల వేదగ్రంథమగు 'కురాను'నంతను అరబ్బీనుండి చక్కగ హిందూస్తానీ కనువదించెను; ఆ వేదము కొక గొప్పభాష్యమును గూడ రచించెను. 'తర్జుమనుల్-కురాన్' అను ఈమహాగ్రంథము ముస్లిం ధార్మికవాఙ్మయము కమూల్యరత్నము. ఇది మూడు సంపుటములుగ తరువాత ప్రచురింపబడి, మహమ్మదీయవిద్వాంసులందరిలోను గొప్పసంచలనము గల్గించినది. (మహమ్మదు ఈశ్వరచోదనద్వారా చెప్పినబోధల సంగ్రహమగు పుస్తకమే కురాను. అది ముస్లిము వేదము. మహమ్మదుగారి యితరరచనలు హాడిసు అనబడును.)

అప్పుడు ఆజాదుగారు 'తజకియా' అను పేర ఆత్మకథనుగూడ రచించిరి. ఇది మూడువందల పుటలు దాటిన విపులగ్రంథము. ఇందు చాలభాగము, ధార్మికవిమర్శలకు, తమపూర్వీకులకు, అప్పటి దేశకాలపరిస్థితులకు సంబంధించిన చర్చతో నిండినది. తుదిఅధ్యాయము మాత్రము ఆజాదుగారి బాల్యజీవితపు విశేషముల దెల్పును. ఇదియు ఉర్దూభాషలో జిగిగల మనోహర శైలిలో వ్రాయబడినది. యుద్ధము సమాప్తియై, ఒక సం॥ గడచినమీదట (27-12-1919 తేదిని) అనగా బ్రిటిషువారికి తుర్కీ

సుల్తానుకు 'సవరసు' సంధియైనమీదట, ఆయన రాంచినుంచి విడుదలయైరి. (అప్పటికి ఆలీసోదరులును విడుదలయైరి.) వెంటనే అజాదుగారు కలకత్తా చేరెరి; అక్కడ తనవాఙ్మయకృషిని మరల అందుకొనెను; ఇదివరలో ఆయన హిందూస్తానిలో కొన్నిసాహిత్యగ్రంథముల రచించెను; ఇందుముఖ్యమైనవి ముస్లింసంస్కృతియు అహింసాసత్యాదులను జాతీయ స్వాతంత్ర్యమును ప్రోత్సహించుననిప్రామాణికముగ కనుపర్చునవి. రాంచిలోనున్నప్పుడు ఈగ్రంథములచ్చువేయించుట కాయన ప్రయత్నించెను. కాని, ప్రభుత్వమువా రేర్పర్చిన నిరోధపుషరతులవల్ల అచ్చుపని సాగలేదు. రాంచిలో తగు ఉర్దూలిపి అచ్చుకూటము లేదు. తరువాత కలకత్తా చేరినమీదట, మరియొకచిక్కు గలిగినది. తానురచించిన గ్రంథముల వ్రాతప్రతులన్నిటిని పోలీసువారు సోదాలో తీసుకొనిపోయిరి. ఆరచనగ్రంథము లేమైనవో! ఆయన సర్కారు ఉద్యోగులకెన్నియో ఉత్తరముల వ్రాసిరి; చాలచర్చజరిగి, సుమారు $1\frac{1}{2}$ సం॥ కాలహరణమైనమీదట ఒకపెద్దకాకితముల మూట ఆయన కొప్పజెప్పబడెను. కాని, విప్పిచూడగా తుక్కు కాకితముల కుప్పలవలెనున్నవి. ఆయనగ్రంథములన్నియూ ఛిన్నభిన్నమై, చెల్లాచెదరైనవి. చాలపత్రములు చిరిగిపోయినవి; మిగిలినవి తారుమారైనవి. తుదకాయన వాటిని సరిచేయు ప్రయత్నము వ్యర్థమై, వాటినన్నిటిని మరలవ్రాసి, రచించుకోవలసివచ్చినది. ధీమంతులు వ్రాసినగ్రంథమును మరల వ్రాయ

బూనుట చాల శ్రమకరమని సాహిత్యకారుల కనుభవసిద్ధమే. కనుక, ఆయన తనరచనల పునరుద్ధరణకు చాల కష్టపడవలసి వచ్చినది.

ఈలోగా రాజకీయపద్ధతులు మరల తీవ్రమైనవి. ఇంతవరకు ఆజాదుగారు స్వాతంత్ర్యభావములుగల్గి, ధార్మికోద్ధరణకు జాతీయైక్యమునకు తాను ప్రత్యేకకృషి చేయుచుండెను. తనఅరబ్బీ పారసీకరచనలద్వారా ముస్లిముల దేశములన్నిటిలో స్వాతంత్ర్యదీక్షను జాతీయపరిణామమునుగల్గించుట కాయనకృషిచేసి, ఆదేశీయుల మెప్పుపొందెను; ఇక్కడిముస్లిములలో స్వతంత్రకృషి చేయవలసివచ్చినది. † 1919 నుండి గాంధీగారు రాజకీయరంగములోనికి దిగిరి. ఉభయుల ఉద్దేశములు పద్ధతులు ఒకేరీతివి. కనుక, వారిలో సమన్వయముకల్గినది. గాంధిమహాత్ముడప్పుడు జాతీయాశయములలో ఖిలాఫతుసాధనను గూడ చేర్చెను. అది ఆజాదుగారికి నిష్టమే.

1921 లో గాంధిగారారంభించిన అసహాయోద్యమములో అబుల్ కలాంగారును పాల్గొనిరి.

---

† మహమ్మదాలీ షౌకతాలీగారలు మొదట ఖిలాఫతునుగూర్చిమాత్రమే శ్రద్ధవహించిరి. అందునుగూర్చి వారు 1920 లో లండనుకు రాయబారముపెళ్ళిరి; కాని వారికక్కడ ఆదరము జరుగలేదు, పరాధీనులకట్లే యగును, ముందుగా జాతీయస్వాతంత్ర్యమునకు కృషిచేయుడని, స్వదేశభక్తులుకండని, వారినప్పుడు తక్కినముస్లిమునాయకులు హెచ్చరించిరి. అప్పుడాసంగతి ఆలీసోదరులకును నాటినది. వారలప్పుడు మాతృదేశముచేరి అజాదు గాంధిగార్లతో సంప్రతించి, జాతీయయుద్ధములో పాల్గొనిరి.

# 5. ఖిలాఫతు ఉద్యమము.

అప్పుడు ఖిలాఫతు ఉద్యమము ముస్లిములందరిలో చాల యాందోళనము గల్గించినది. దానిభావమును ప్పుడు సూక్ష్మముగ పరిశీలింతము. 7 వ శతాబ్దిలో నుద్భవించిన మహమ్మదు తననవ్యమతమును స్థాపించుటేగాక, అరబ్బుల నొక మహాజాతిగ జేసి, వారికి విజ్ఞానాపేక్షను ధార్మికవీరత్వమును గల్గించెను. ఆయన ముస్లిమునాయకుడై 'ఖలీఫా' అనిపించుకొనెను ఆయన అనంతరం, ముస్లిం ప్రపంచపుముఖ్యనాయకుడొకడు 'ఖలీఫా' అగుచుండెను, ఈఖలీఫా ముఖ్యముగ ముస్లిముల తీర్థక్షేత్రముల కాపాడవలెను; తుదకు టర్కీసామ్రాజ్యము ముస్లిం రాజ్యములన్నిటిలో ప్రబలమైనది. కనుక, టర్కీసుల్తాను అరేబియా పాలస్తీనులందలి పుణ్యక్షేత్రములకధికారియైనాడు; ఇట్లు ఆయన ఖలీఫా అనగా ముస్లిం సంస్కృతిరక్షకుడు అని మహమ్మదీయులందరు నంగీకరించిరి.

1918 నవంబరులో మహాయుద్ధము పూర్తియైనది. అంతకుపూర్వమే బ్రిటిషుప్రధానియగు లాయిడు జార్జిగారు ముస్లిముల ఖిలాఫత్తునకు నష్టమురానీయమని ప్రచురించిరి; కాని యుద్ధములో టర్కీ జర్మనీకి తోడ్పడెననుకోపమున బ్రిటిషుపక్షపు మిత్రమండలివారు (తాము ఆపత్కాలంలో నిచ్చిన ప్రమాణమును మరచి) టర్కీసామ్రాజ్యమునుండి దాని ఆధీన

దేశములన్నిటిని విడదీసిరి; అరేబియాను తమ ప్రాబల్యము క్రింద పెట్టుకొనిరి. ఈజిప్టును తమసామ్రాజ్యరక్షణలో చేర్చు కొన్నట్లప్పటికే ప్రకటించిరి. యూరపులో టర్కీ కధీనమగు ముఖ్యదేశమునుగూడ విడదీసి స్వతంత్రముగ జేసిరి. ఈపరాభ వములన్నియు చాలక, టర్కీసుల్తానును వారు వశపర్చుకొనిరి. ఆయన మిత్రమండలివారి యిష్టప్రకారం నడుచుకొని, తురు ష్కుల కవమానకరమగు సంధిపైన సంతకముపెట్టెను. కాని టర్కీయువకు లందు కొప్పుకోక, 'కెమాల్ పాషా' అనువీరుని నాయకత్వమున తిరుగబడి ఆసియా టర్కీలో స్వతంత్రరాజ్యము స్థాపించుకొనిరి. దీనికి 'అంకారా' ముఖ్యపట్టణము. వారినోడించు టకు మిత్రమండలి ప్రోత్సాహముతో గ్రీకుసేనలు యత్నించినవి. కాని, టర్కులు వారిని నిరోధించి తమస్వాతంత్ర్యమును కాపా డుకోగలిగిరి. ఖలీఫాయగు టర్కీసుల్తాను బ్రిటిషునౌకలో నెక్కి పారి పోయి, మాల్టాలో బ్రిటిషువారి దాసుడై యుండెను. ఇట్లు ఖలీ ఫాకును అతని సామ్రాజ్యమునకును ఇట్టి దుర్గతిగల్గుట ముస్లిము లోకమంతటికి శోకమును అవమానమునుగల్గించెను. ముస్లి ములు తమపుణ్యక్షేత్రములు రక్షించుకోవలెనని కురానులోను చెప్పబడినది. కనుక, ఖిలాఫతు (అనగా 'ఖలీఫా' సంస్థ)రక్షణ కని ముస్లిందేశీయులందరును గొప్ప ప్రచారమారంభించిరి.

భారతదేశపు జనసంఖ్యలో ముస్లిములకన్న హిందువులే హెచ్చుమంది. కాని, మనమహాదేశమున 8 కోట్లపైగా ముస్లి

ములున్నారు. ఇంతమంది ముస్లిములు మరియేదేశములోను లేరు. కనుక, మనదేశంలోను అప్పుడు 'ఖిలాఫతు' ఉద్యమము తీవ్రముగ వ్యాపించినది. దీని ముఖ్యనాయకులు మహమ్మదాలీ షౌకతాలీ సోదరులు, అజాదు. మనదేశపు ముస్లిములలో వారికి హెచ్చుపలుకుబడి యుండెను. సోదరుల చిన్నవాడగు మహమ్మదాలీగారు మౌలానాఅజాదుకన్న పదేండ్లుపెద్ద. కాంగ్రెసు ఉద్దేశములలో జాతీయస్వాతంత్ర్యము పంజాబు నష్టపరిహారముతో పాటు ఖిలాఫతు సాధనగూడ చేర్చియెడల ముస్లిములందరిని ప్రోత్సాహపరచి తాము స్వాతంత్ర్యోద్యమములో పూర్తిగ పాల్గొందుమని వారును మరికొందరు ముస్లిములును తెలిపిరి. మిత్రమండలి వారప్పుడు టర్కీ రాజ్యమును ఛిన్నభిన్నము చేసి ఖలీఫాయగు సుల్తానును పదభ్రష్టుని చేయుట రాజకీయముగను అన్యాయమే; కనుక, ఆప్రకారం ఖిలాఫతు ఉద్యమముకు తోడ్పడుటకును శ్రీ గాంధి మున్నగు కాంగ్రెసునాయకు లంగీకరించిరి. ఈవిషయములో అజాదుగారు సమన్వయముకై తమ శక్తి నుపయోగించిరి.

# 6. అసహాయోద్యమము.

ఇట్లు అసహాయోద్యమము 1920--21 లలో చాలతీవ్రముగ జరిగినది. దానిని సాగించుటకు సత్యాగ్రహసభ స్థాపితమైనది. అందుల నల్గురుసభ్యులలో ఆజాదుగారొకరు. అప్పుడు వేలకొలది విద్యాధికులు సర్కారుకు ప్రాబల్యమిచ్చు ప్రభుత్వపు ఉద్యోగములు, కోర్టులు, కళాశాలలుబడులు, శాసనసభలుగూడ విడచి, వాటిని బహిష్కరించిరి. దేశమందాందోళనము హెచ్చినది. ప్రభుత్వపుపరపతి తగ్గ నారంభించినది. కనుక దానిని పునరుద్ధరించి, జనులలో బ్రిటిషుసర్కారుపైన భక్తిగల్గించుటకు సర్కారువారప్పుడుదేశమందు వేల్సు యువరాజు సంచారము చేయునట్లేర్పర్చిరి. (బ్రిటిషురాజచక్రవర్తిగారి యనంతరపువారసుకు వేల్సు యువరాజు అని బిరుదుకలదు.) 1921 నవంబరులో ఆయువరాజు మనదేశముకు విచ్చేసి బొంబాయిలో దిగెను. ఈచర్యను బ్రిటిషువారు తమ ఆధిపత్యమును బలపర్చుట కుద్దేశించిరి; కనుక, యువరాజసంచారములో పాల్గొనక, ఆయన పేరజరుపు ఉత్సవములను భారతీయులు బహిష్కరించవలెనని కాంగ్రెసువారు నిశ్చయించిరి. యువరాజు దయచేసిన ప్రతినగరపువీధులును ఆరోజున నిర్జనములైనవి. ఆయన గౌరవార్థము జరుపుసభలకు కొద్దిమంది స్వార్థపరులు 'రాజభక్తు'లుమాత్రము విచ్చేసిరి. ఆడిసెంబరులో బ్రిటిషు యువరాజు కలకత్తాకు దయ

చేసెను. అక్కడ శ్రీదాసు సుభాసుగార్లు మున్నగు తక్కిన జాతీయనాయకులతోబాటు అబుల్ కలామును తీవ్రప్రచారముచేసి, బహిష్కారమును పూర్తిగసాగించెను. అంతట సర్కారువారు కోపోద్దీపితులై, తక్కిననాయకులతోబాటు అజాదునుగూడ 10-12-1921 తేదీని అరెస్టుచేసిరి. యువరాజబహిష్కారమును శాంతముగ సాగించి, జనులలో అల్లరులులేకుండ జేయుటకు కాంగ్రెసువారు 1921 లో 'వాలంటీరు'లనుపేర స్వయంసేవకులను బోగుచేసిరి. ఈవాలంటీరుదళములు అక్రమసంఘములని క్రిమినలు లా సవరణచట్టప్రకారం సర్కారువారు నిషేధించిరి. (కనుక, ఆసంఘపు సభ్యులందరూ దోషులని మోచబడుదురు.) అజాదు ఆసంఘములో సభ్యులై తక్కినదేశీయులును సభ్యులుకండని ప్రచారముచేసెను. ఈనేరము కాయనను కోర్టువారు విచారణచేసిరి. అప్పటికాంగ్రెసుతీర్మానము ప్రకారమాయన విచారణలో పాల్గొన నిరాకరించి, ఒక స్టేటుమెంటును మాత్రము కలకత్తా ప్రెసిడెన్సీ మేజస్ట్రేటుగారియొద్ద దాఖలు చేసెను. ఈస్టేటుమెంటులో ఆయన ఈదేశపు ప్రజలకు బ్రిటిషుసామ్రాజ్యపద్ధతివల్ల జరుగుబాధలును అన్యాయములును పూసగ్రుచ్చినట్లు వివరించిరి.

ముస్లింమతస్థులందరును జాతీయస్వాతంత్ర్యముకై యావచ్ఛక్తిని వినియోగించి తమదేశమునుద్ధరించవలెనని మహమ్మదీయమతము ప్రబోధించుచున్నదనిగూడ ఆయనకురాను

మున్న గుమత గ్రంథములనుండి స్వష్టప్రమాణములతో నిరూ పించెను. ఈ స్టేటుమెంటు విపులమై అద్భుతమైనది.† అంతట (1922 ఫిబ్రవరిలో) ఆయనకు కఠినశిక్ష విధించిరి.

కారాగృహమునుండి 1923 సం॥ ఆరంభమున అజాదు గారు మరల విడుదలయైరి. అప్పటికి దేశస్థితి కొంతమారి నది. అసహాయోద్యమము సన్నగిలినది. జాతీయోద్యమము సామాన్యజనులలోను గ్రామాలలోను ఇంకను సరిగా వ్యాపిం చలేదని తేలినది. కొన్నిచోట్ల జనులలో హింసాతత్వము చెల రేగి, అల్లరులు దొమ్మి జరిగినవి. అహింసాయుద్ధమునకు భంగము కల్గినది. జనులలో నుత్సాహము సడలినది. కోర్టులు కాలేజీలు మానినవారిలో చాలమంది మరల వాటినాశ్రయించిరి.

ఈ దేశమంతటను 1919 లో వచ్చిన సంస్కరణాలప్ర కారం, 1920 లో కొత్తశాసనసభల కెన్నికలు జరిగెను; వాటిని కాంగ్రెసువారు సీదాగా బహిష్కరించిరి. అంతట మితవాదులు కులతత్వపరులు వాటిలో సభ్యులైరి. మంత్రివర్గములును అట్టివారిపాలైనవి. 1921 సాలాఖరున యువరాజుగారు వచ్చిన మీదట బొంబాయి వగైరాలలోను 1922 ఫిబ్రవరిలో చౌరిచౌ రాలనుచోటను జనులు దొమ్మిచేసిరి. పోలీసులను బాధించిరి.

---

† గాంధిమహాత్ముడు తనయంగుయిండియాపత్రికలో వ్రాయుచు అజాదుగారి యీస్టేటుమెంటు సంగతులు మెచ్చుకొనెను.

ఈస్థితిలో జనులలో హింసాప్రకోపముకలిగెనని, తాముద్దేశించిన శాసనధిక్కారకార్యమును గాంధిగారు 1922 ఫిబ్రవరిలో నిల్పుచేసిరి. అంతట రాజద్రోహపునేరముకు గాంధిగారు అరెస్టు అయి, జైలులో నుంచబడిరి. అసహాయోద్యమపుతీవ్రత తగ్గినది. అంతట కాంగ్రెసులో రెండుపక్షములేర్పడినవి. 1922 ఆఖరున గయలో కాంగ్రెసు అధ్యక్షులైన శ్రీ చిత్తరంజనదాసుగారు తమఅధ్యక్షోపన్యాసములోనే కాంగ్రెసువారు బహిష్కారము మాని శాసనసభలయెన్నికలలో పాల్గొనవలెనని సూచించిరి. మోతీలాలునెహ్రూగారు నీపక్షమునకువచ్చిరి. ఇట్లు 'స్వరాజ్య' పక్షమనుపేర సభాప్రవేశవాదులు ప్రత్యేకకక్షమైరి; వీరికిని సభాబహిష్కారవాదులకును సంఘర్షముకలిగినది దేశములో కొందరు హిందువులకు ముస్లిములకుమధ్యను చాలచోట్ల కొట్లాటలు దొమ్మి జరిగినవి. 1922 లో ముల్తానులోను, 1923 లో కొన్నిప్రాంతాలలోను, హత్యజరిగినది.

ఈసాంఘికహింస నానాటికి హెచ్చుచుండెను. సాంఘిక కల్లోలము ఇదివరలో ముస్లింనాయకులను కాంగ్రెసుకాకర్షించిన ఖిలాఫత్తు ఉద్యమము తరంతట క్షీణించినది. అంతవరకు ముస్లిం లోకమంతకు 'ఖలీఫా'యైన తుర్కీసుల్తాను తమవ్యతిరేకులగు బ్రిటిషువారికి లోబడెను. కనుక, ఆయనను తుర్కీ

† టర్కీయుపకపక్షము రాయించెనని తెలియగనే సుల్తాను ఒక బ్రిటిషునౌకపైన బ్రిటిషుపాలితమగు మాల్టాద్వీపముచేరి, అందుండిపోయెను.

ప్రజలధికారమునుండి తొలగించిరి. టర్కీలో ప్రజాతంత్రము (రిపబ్లికు) ఏర్పడినది. దానికధ్యక్షులుగ కెమాల్ పాషాగారినే టర్కీప్రజలెన్నుకొనిరి. ఖిలాఫత్తు కేవలంమతసంబంధము. "టర్కీ పాలకుడు ఖలీఫాగనుండుటవల్ల టర్కీరాజ్యాంగమునకు లేనిపోని చిక్కులేర్పడినవి. మరియు, ఈకాలపు పరిస్థితులబట్టి రాజకీయ ముకు మతమునకు ప్రత్యక్షసంబంధముండుట రెంటికిని హానికర మే" అని కెమాల్ పాషాగారు కనిపెట్టిరి; తాను ఖలీఫాగనుండ నిరాకరించుటేగాక, ఖిలాఫతుసంస్థనే తొలగించివేసిరి. ఈచర్య కితరముస్లింరాజ్యములు నంగీకరించినవి. పాలస్తీను అరేబియా వగైరాలపైన అధికారమును టర్కీవారు వదలుకొనిరి † ఇట్లు ఖిలాఫత్తు ఉద్యమపుమూలముపోయినది. అది స్వతంత్రమగు ముస్లిందేశాలన్నిటిలోను పోయినను మనదేశములో ముసల్మాను లుమాత్రం ఖిలాఫతునుగూర్చి ఇంకను చాలయేండ్లు ఆందోళనచేయుచునే వచ్చిరి. పరాధీనజనుల మనోభావములు వికృతి నొందుననుట కిదియొకనిదర్శనము. * క్రమంగా మనదేశమం

† తుర్కీరాజ్యపు హక్కులవిషయమై 1922 సాలాఖరున లాసానులో బ్రిటిషుప్రతినిధులు టర్కీప్రతినిధులు సమావేశమై కొన్నిషరతులు నిర్ణయించుకొని ఇక తగువులేకుండ సంధిచేసుకొనిరి.

* హైదరాబాదు నిజాముగారిని ఖలీఫాగజేయుటకు కొంతప్రయత్నము జరిగినది. (ఆయన పూర్వపుసుల్తానుతో వియ్యమొందెను.) కాని ఆసూచన కితరముస్లిందేశములవా రొప్పుకోలేదు.

మన్న ఖిలాఫతుసంస్థలు కేవలం సాంఘికదృష్టిలోబడి, జాతీయ కృషికంతకు వ్యతిరేకించెను. టర్కీలో ఫెజ్‌టోపీ, అరబిక సంప్రదాయమును, పారసీలిపి వ్యవహారాలను, బహిష్కరించిరి. కాని, వీటికి ముస్లింమతముతో అవినాభావపు సంబంధమున్నదని అందులోనే ముస్లిముమతపుఘనత యున్నదని, ఇక్కడి ఖిలాఫతుసంస్థలు తలచిరి. మసీదులయెదుట సంగీతము, ముస్లిముల గోహింస, శుద్ధిసంఘములు, ఇట్టివాటినిగూర్చి తగువులు గల్గెను; ఒకప్పుడు దొమ్మి గల్గుచుండెను.

అప్పుడు అబుల్ కలాంగారు కాంగ్రెసులో ఆర్యసంఘములమధ్యను హిందూముస్లిం సంఘములమధ్యను సమన్వయముచేసి, సఖ్యముగల్గించుటకన్నివిధములను తమశక్తిసంతను వినియోగించిరి.

# 7. ఢిల్లీకాంగ్రెసు అధ్యక్షత.

1923 లో ఆయా రాష్ట్రములందు మరల కౌంసిళ్ళకు శాసనసభలయెన్నికలు జరుగనుండెను. అందుకు స్వరాజ్యపక్షములు పోటీచేయుచుండెను తక్కిన కాంగ్రెసునాయకులు బహిష్కారముచేసిరి. ఇట్లు కాంగ్రెసు అంతర్భేదములవల్ల భిన్నమగునట్లుండెను. ఈప్రమాదము తప్పించుటకు కాంగ్రెసుకు ప్రత్యేకసమావేశమును జరిగించి తగువు పరిష్కరించవలెనని నాగపురములో అఖిలభారతకాంగ్రెసు కమిటీవారు 1923 జూనులో నిశ్చయించిరి; (ఆమహాసభకు శ్రీ అబుల్ కలాముగారధ్యక్షులుగ నుండవలెనని తరువాత నిర్ణయమైనది.) ఈతీర్మానమును 3-8-1923 తేదిని విశాఖపట్టణములో మరల ఆకమిటీవారు ఖాయపర్చిరి. అంతట ఆసాలు సెప్టెంబరు 3 వ వారములో కాంగ్రెసు ప్రత్యేకమహాసభ ఢిల్లీనగరములో జరిగినది. ఆయాసంఘములమధ్య సమాఖ్యచేయుట కందరిలోను అర్హులైన మౌలానాఅజాదుగారామహాసభ కార్యక్రమము నెంతో చాకచక్యముతో జరిపి కాంగ్రెసులో ఉభయపక్షములకును కలహము లేకుండ కొన్నిసూచనలజేసిరి. "రాజకీయములలో కాంగ్రెసులో కొందరు శాసనసభలకు వెళ్ళదలచినవారు అట్లు చేయవచ్చును; అందుకు తక్కిన కాంగ్రెసుసభ్యులెవరును వ్యతిరేకప్రచారము చేయకూడదు" అని యిదివరలో మౌలానా

అజాదు జవాహర్లాలుగారు చేసినసమాఖ్య సిద్ధాంతము నాసభవారు అంగీకరించి ఖాయుపర్చిరి; అంతుమీాదట శాసనసభల ఎన్నికలలో చాలమంది స్వరాజ్యపక్షీయులు పోటీచేసి, గెల్చి, సభ్యులైరి. కేంద్రసభలో ఈస్వరాజ్యపక్షముకు శ్రీ మోతీలాలు నెహ్రుగారు నాయకులైరి. మన మద్రాసురాష్ట్రమందు అప్పటి కాంగ్రెసునాయకులందరును 'నోఛేంజరు'లే, అనగా వారాసభల బహిష్కరించువారే; కాని, బెంగాలులో దాసుగారి నాయకత్వమున స్వరాజ్యపక్షీయులు హెచ్చు సభికులైరి.

అక్కడ, అప్పటి సర్కారువారి సంస్కరణల ప్రకారము అమలులోనున్న ద్వంద్వప్రభుత్వమును స్వరాజ్యపక్షీయులు ప్రతిఘటించి, అప్పటిమంత్రులపైన ప్రజలకు నమ్మిక లేదని సభలోతీర్మానించి, ప్రభుత్వమునోడించిరి.

ఇట్లు రెండుపక్షములమధ్యను సంఘర్షము కలహము లేకుండుటకై, కాంగ్రెసువారిలో కొందరు శాసనసభ్యులౌటకు సవాలానాగారు తోడ్పడిరి. కాని ఆయనమాత్రం ఏశాసనసభలోను సభ్యతకు యత్నించనేలేదు. ఈ'మెంబర్' ఆయన ప్రకృతికి వ్యతిరేకము. అప్పటి ద్వంద్వప్రభుత్వమును ప్రతిఘటించి నిర్మూలించుటే ఆస్వరాజ్యపక్షీయుల ఆశయము. ఇట్టివినాశక కార్యక్రమమాయనకు గిట్టదు. కనుక ఆయన కేవలం గాంధి పక్షీయుడుగనేయుండి, జాతీయబోధలోను, సాంఘికమైత్రి మొదలగు నిర్మాణకార్యక్రమమందును మగ్నుడైనాడు.

ముఖ్యంగా, ఆయామతములమధ్య పరస్పరసంఘర్షమున్నదని, సిద్ధాంతములందో హిందూమతమునకు ముస్లింమతము కేవలం వ్యతిరిక్తమని జనులూహింతురు. ఇది పట్టిపొరబాటని, ఆయన శాస్త్రచర్చద్వారాను మహమ్మదువగైరా ప్రవక్తల జీవితములనుండి నిదర్శనములిచ్చియు, చక్కగ ఋజువుపర్చినారు. ఇందుకు ఆయన సర్వవిధములను తగినారు. అహింసాప్రేమలు, సత్యపరత్వము, ఇతరులద్రవ్యము నపేక్షింపకుండుట, పరిశుద్ధత, నిగ్రహమును ధర్మమూలములని, నా[illegible]వలంబించుటే నిజమైనమతమని మనుస్మృతి భగవద్గీత మొదలగు హిందూధర్మపు గ్రంథములు చెప్పుచున్నవి. ఈసంగతిని గాంధిమహాత్ముడేగాక కొందరుహిందూధర్మశాస్త్రజ్ఞులునుచాలసార్లు నిరూపించినారు. కాని మహమ్మదీయధర్మపు సిద్ధాంతములు వారిసంప్రదాయములుఅట్టివికావని, హింసాబోధకములని, అన్యమతద్వేషమును స్వార్థపరతను విషయాసక్తిని ప్రోత్సహించునని, చాలమంది భ్రమపడుచుందురు. నిజముగా ముస్లిముల వేదమగు కురానులోను దరిమిలా ధార్మికవేత్తల బోధలలోను అహింసాసత్యములే మతాధారములని, కామక్రోధములు హానికరములని, స్పష్టపర్చిరి. మహమ్మదు ఆలీ హుసైనును మొదలగు ప్రవక్తల జీవితమునుండియు పరస్పరప్రేమయు సహనమును, త్యాగమును అందరి నిశ్రేయసము కవసరమని, విశదమగును. దరిమిలాను ముస్లింవీరులు అన్నిదిశలను జరిపిన దండయాత్రలబట్టియు, మన

దేశమందలికొందరు ముస్లిం పాలకులు కేవలం వినాశకమగు దుష్టచర్యలజరిగించినట్లు ఆంగ్లచారిత్రకులు వ్రాసిన అసత్య రచనల జదివియు, చాలమందికి ముస్లింసంస్కృతినిగూర్చి భ్రమ కల్గినది. ముస్లింసంస్కృతిలోని యథాస్థితిని విశేషములను వివరించి, ముస్లింధర్మము హిందూధర్మమును ఒకేసూత్రములపై నాధారపడినవని కనపస్చుట కీదేశమందంతటిలోను మౌలానా అజాదుగారే అన్నివిధములను తగినవారు. తన అసమానమైన ధార్మికత్వము పాండిత్యము నుపయోగించి, అజాదుగారు చాలమంది మౌలానాలను తృప్తిపర్చెను. అఖిలభారతముస్లిం ధర్మమహామండలియగు 'జమయుతుల్ ఉలేమాహిందు' వారును ఇట్టిభావమునే తెల్పి భారతజాతీయతకు హిందూముస్లిం సామరస్యముకు అనుకూలురై యున్నారు. ఇప్పుడు జిన్నాగారి ముస్లింలీగువారు హానికరమగు సాంఘికవిభేదమును అన్యమతస్థులపైన ద్వేషమును బోధించుచున్నను, ఈధోరణిని జమయుతుల్ ఉలేమాయున్నగువారు నిరసించిరి; ముస్లిములలో నిట్టి ఉదారధోరణి గల్గించుటకు, ముఖ్యంగా ధార్మికౌదార్యము వ్యాపింపజేయుటకు, మౌలానాఅజాదుగారి కురానుభాష్యము మున్నగు మతగ్రంథములును ఉర్దు వ్యాసములును చాలవరకు కారణమైనవి. ఆయన వ్యాఖ్యానమును అన్నిదేశములలోను ఉదారులగుముస్లిములు ప్రమాణముగ అంగీకరించినారు. ఆయన అరబ్బీభాషలోను గొప్ప మతగ్రంథములు రచించినారు.

---

# 8. సత్యాగ్రహము, జైలు.

ఇట్లు ధార్మికోన్నతి నిమిత్తము హిందూముస్లిం సంఘముల మైత్రినిమిత్తమును 1923 నుండి అజాదుగారు తీవ్రకృషి చేసిరి. 1923 డిసెంబరులో కాకినాడలో జరిగిన కాంగ్రెసులో శాసనసభాప్రవేశ మంగీకరింపబడినది. ఇట్లు నిర్మాణకార్యము వెనుకబడినది. సాంఘిక కలహము లక్కడక్కడ చెలరేగినవి.

దేశమందు సాంఘికవాదులు శాసనసభలందు అధికారముకై ప్రయత్నించిరి. మద్రాసులో 'జస్టిసు పక్షము' మంత్రిత్వము వహించినది. తక్కినచోట్లను కులతత్వవాదులు సాంఘికద్వేషమును జనులకు బోధించిరి. బ్రిటిషుప్రభుత్వమువారీదేశపు రాజ్యాంగములో ముస్లిముసభ్యులను ముస్లిం నియోజకులే యెన్నుకోవలెనని, అట్లే క్రైస్తవసభ్యులను క్రైస్తవులే యెన్నుకోవలెనని, ఏర్పర్చిరి. ఇట్టి ఆయామతములబట్టి ప్రత్యేక నియోజకవర్గము లేర్పరుచుట తక్కిన నాగరికదేశములం దెక్కడనులేదు. ఇట్టి వర్గపద్ధతివల్ల విభేదములు వైమనస్యములు హెచ్చినవి. పరస్పరవిశ్వాసము తుగంటి కలతల వృద్ధికి కారణమైనది. ముస్లిములలో చాలమంది 'నాయకులు' ప్రత్యేకనియోజకవర్గములనే కోరిరి. సర్కారును అందుకు ప్రోత్సాహమిచ్చి, జనులలో అన్యోన్యత చెడుటకు కారకులైరి. కాని అబుల్ కలాం అన్సారీమున్నగు జాతీయముస్లిములు సమిష్టినియోజకవర్గము

లుండుటచే దేశమునకు ఆయాసంఘములకుగూడ లాభకరములని నిరూపించిరి. ప్రత్యేక నియోజకపద్ధతి హానికరమనే వీరినిరూపణ తరువాత ఋజువైనది. కాని, వారియుద్బోధనను సర్కారువా రసలే లక్ష్యపెట్టలేదు.

భారతీయరాజ్యాంగమును పరీక్షించి చట్టము సవరించుటకు బ్రిటిషుప్రభుత్వమువారు 'సైమనుసంఘు'మేర్పర్చిరి. ఇందలి సభ్యులందరును ఆంగ్లపార్లమెంటుసభ్యులు; వీరు మన జాతీయాశయములకు వ్యతిరేకులు, సాంఘికవాదులైన కొందరు ముస్లిము లీసంఘము నెదుట సాక్ష్యమిచ్చి సహకారము చేసిరి. కాని, అబుల్ కలాముగారు కాంగ్రెసు ఆదేశము ప్రకార మాసభవారిచర్యలన్నిటినిబహిష్కరించిరి; భారతీయసంస్కృతిని ముఖ్యముగ ముస్లిముల సంస్కృతిని సంస్కరించి, శాంతముగ జనులలో జాతీయతను నీతిని ధార్మికతను తనలేఖలద్వారా వృద్ధిచేయుచుండెను; తాను శాసనసభలలో జేరలేదు. ఆయన మితభాషి, వ్యర్థమగు వాగ్వ్యయముకొప్పుకోడు.

ప్రభుత్వమువారు భారతీయులకు తమంతట స్వపరిపాలనమిచ్చుటలేదని స్పష్టమైనది. 1929 సం॥రంనాటికి స్వరాజ్య పక్షీయులును విసుగుజెంది, ఆసభలవదలివచ్చిరి. ఆసాలాఖరున లాహోరు కాంగ్రెసులో జవాహర్లాలుగారి అధ్యక్షతను సంపూర్ణ స్వాతంత్ర్యమే భారతీయుల కాశయము గమ్యమునని తీర్మానించిరి. స్వరాజ్యసాధనకై, దేశమంతటను సమిష్టిసత్యా

గ్రహాము జరుపనిశ్చయించిరి. గాంధిమహాత్ముని నాయకత్వమున దేశమంతటను సత్యాగ్రహము జరిగినది. కొందరు ఉప్పు చేసియు, కొందరు విదేశపుబట్టల దుకాణములయొద్దను, కల్లంగటులయొద్దను నిరోధముచేసియు, సర్కారువారి చట్టములనుల్లంఘించి,అరెస్టుఅయినారు; వేలకొలది జైలులో నుంచబడిరి. నియంతయగు గాంధిగారరెస్టు అయినతరువాత, వారిస్థానే కొత్త నియంతలు వరుసగానేర్పడి, అరెస్టుఅగుచువచ్చిరి. మౌలానా ఆజాదుగారు జాతీయనాయకులు, కాంగ్రెసు కార్యనిర్వాహకులలోనొకరు; కనుక ఆయనయు'అగ్రమసంఘు'సభ్యులుగ నేర్పడి, సత్యాగ్రహము సాగించిరి. అందువల్ల 1930 సం॥లో ఆయనకును సర్కారువారు శిక్షవిధించి, ఆయనను మరల జైలులో నుంచిరి. ఇట్లు తీవ్రసత్యాగ్రహము సాగినమీదట, ప్రభుత్వమువారు రాజీసూచనలజేసిరి; 1931 జనవరి ఆఖరున కొందరు నాయకులు విడుదలచేయబడిరి. 1931 మార్చి 5 వ తేదీని గాంధి ఇర్విను సమాఖ్య జరిగినందున, తక్కిన సత్యాగ్రహులును, జైలునుండి వదలబడిరి. ఇతరనాయకులతోబాటు మౌలానా ఆజాదుగారు విడుదలయై, మరలజాతీయకృషిలో పాల్గొనిరి.

సదరు సమాఖ్యప్రకారం, ముందురాజ్యాంగము నిర్ణయింప లండనులోజరుగు మహాసభకు జాతీయపక్షములవారి సంప్రతింపును కాంగ్రెసువారి ప్రతినిధులతోబాటు జాతీయ ముస్లిము ప్రతినిధిగ అన్సారీగారినాహ్వానింతుమని ఇర్విను ప్రభు

వుగారు సూచించిరి; కాంగ్రెసుతరపున ప్రతినిధుల బంపుడని కాంగ్రెసు అధ్యక్షునికి ప్రభుత్వసందేశమంపిరి. కాంగ్రెసుసంఘము సమావేశమై, తమతరపున ఏకైకప్రతినిధిగ గాంధిమహాత్మునిమాత్రము పంపుదుమని సర్కారుకు తెలిపిరి.

అప్పటిసర్కారువారు ఈదేశపు సంస్థానాధిపులు, వారి మంత్రులు, జమీందార్లు, విదేశవ్యాపారస్థులు, యంత్రయజమానులు, ఆయాజాతుల కులతత్వపరులు, ఇట్టివారికి ప్రతినిధులుగ తమయిష్టులైన చాలమందిని రప్పించిరి. ముస్లిములు, క్రైస్తవులు, సిక్కులు ఇట్టి వేర్వేరు సంఘములతరపున కేవలంస్వకులాభిమానులగు స్వార్థపరులనే రప్పించిరి. ఆయాసంఘములలో కొందరే ఇట్టిసంకుచితభావులు, కొందరు ఉదారులగు జాతీయవాదులు; ఆసభకు ఉదారపక్షీయుల నసలేపిలువక, కేవలం కులతత్వపువారినే పిలిపించి వారితోనే సంప్రతించుటవల్ల భారతీయులందరూ ముఖ్యంగా ముస్లిములందరూ కులతత్వపువారే అని, స్వసంఘలాభమునే కోరుదురని, జాతీయస్వాతంత్ర్యముకు వ్యతిరేకులని, బ్రిటిషుప్రజలకును లోకముకును తోచును; బ్రిటిషువారు నడుపువార్తాపత్రికలును బ్రిటిషుప్రతినిధులును ఇట్లు ప్రకటించుటయుకలదు.

మనదేశపు జాతీయవాదులును జాతీయపత్రికలును ఈ అన్యాయమును వెల్లడించి, ఆయాసంఘముల ప్రతినిధులుగ జాతీయవాదులగూడ బిలిపింపగోరిరి. మనదేశపు 8 కోట్ల ము

స్లిములును కాంగ్రెసుకు వ్యతిరేకులని, వారిరక్షణకై తామే పాలించుట అవసరమని,సాంఘికవాదు లనుమాటలనుదహరించి సర్కారువారు చెప్పుట కలదు.లండనులోని'రౌండుటేబిలు'సభకు సర్కారువారు రప్పించిన సభ్యులందరును కులతత్వపుస్వార్థ పరులే. జాతీయవాదులలో డాక్టరు అన్సారీ, మౌలానాఅబుల్ కలాంవంటి విద్వాంసులు, ధీమంతులు, ప్రజాప్రియులు, సమర్థులునగు మహనీయులున్నారు. అజాదు సభలలో పాల్గొనుట కిష్టములేనివారు; కనుక, అన్సారీపేరును సూచించిరి. జాతీయపక్షపు ముస్లింపత్రికలు, సంఘములును, గాంధిగారును ప్రభుత్వము నట్లుకోరినను, ప్రభుత్వమువారు రద్దుచేయలేదు. కనుక, జాతీయముస్లిము లెవరు నాసభకు రాకుండజేసి, ముస్లిములందరూ భారతీయస్వాతంత్ర్యముకు జాతీయతకు వ్యతిరేకులు అని సర్కారు,జిన్నా, ఘుజ్నవి, అబుల్లాహరును ప్రభృతులు లోకులకు దురభిప్రాయము కల్గించిరి. హిందూముస్లిముల సాంఘిక సమస్యలుముందు పరిష్కారమగువరకు స్వపరిపాలనసమస్య నిర్ణయింపమని బ్రిటిషుప్రభుత్వమువారు ప్రచురించిరి; తుదకాసభ ఇట్లు భగ్నమై, గాంధిగారీదేశముకు 1931 సాలాఖరుకు మరల వచ్చిరి. అప్పటికే సరిహద్దుప్రాంతపు కాంగ్రెసునాయకుడగు అబ్దుల్ గఫ్ఫారుఖాను వగైరా కొందరు జాతీయపక్షీయులను సర్కారువారు నిర్బంధించిరి. వెంటనే మరల ప్రభుత్వమునుండి ఆర్డినెన్సులు నిర్బంధచర్యలు, ప్రజానాయకులనుండి సత్యాగ్ర

హమును, జారీయైనవి. దేశమంతయు కల్లోలమున మునిగినది. అప్పుడు మరల మౌలానా అబుల్ కలాంగారును సత్యాగ్రహాని యంతయై, అరెస్టు అయి, సర్కారువల్ల జైలులో నిర్బంధింపబడిరి. ఇట్లాయన మరల సుమారు రెండేండ్లు ఖైదులోనుండిరి; ఆయన జాతీయకృషికేగాక, శాస్త్రపరిశోధనకును ధార్మికసాధనకును విరోధము కల్గినది.

మరల సత్యాగ్రహమారంభించిన 1932 ఆరంభంనుండి సర్కారువారు నాయకులందరిని అరెస్టుచేయుటేగాక, వేలకొలది జనులను లాఠీదెబ్బలపాలు చేసిరి,అనేక నిర్బంధములు జారీచేసిరి; సాంఘికవిభేదములు హెచ్చింపజేసిరి. సాంఘికనాయకులు 'రాజభక్తు'లైరి. ఈసత్యాగ్రహములో ప్రభుత్వమువా రుద్దేశించినట్లు,ముస్లిములు వగైరాలు కులతత్వపరులై,సత్యాగ్రహముకు వ్యతిరేకులైరి; ప్రభుత్వముకాని,మౌలానాఅజాదుగారు అన్సారి ఖానుఅబ్దుల్ గఫారుఖాను మున్నగు ముస్లిం నాయకులతోబాటు కొందరు సామాన్యముస్లిములును సత్యాగ్రహములో పాల్గొనిరి. ఆదిహిందువులు 6 కోట్లమంది ప్రజలున్నారు. వారిని సవర్ణులు దూరముగనుంచి, అస్పృశ్యులుగనెంచి బాధపెట్టుటవల్ల, వారు సామాన్యముగ జాతీయతకు వ్యతిరేకులైరి. హరిజనులు ఆయుద్యమములో పాల్గొనక, సర్కారుకు సహాయకులైరి. ఎన్నికలలో ముస్లిములకు ప్రత్యేకనియోజకవర్గములిచ్చినందున, హిందుముస్లిము సంఘముల మధ్యకలతలు హె-

చ్చినవి. ఇట్లే రాబోవురాజ్యాంగములో హరిజనులకును ప్రత్యే కనియోజకవర్గము పెట్ట నిశ్చయించిరి. ఇందువల్ల వారితో సవర్ణులకుసంబంధముండదు. ఇది హిందూసంఘమంతటిలో ఉద్రేకము. విభేదములు కలతలు కల్గించును, కనుక దానినన్నెట్లైన నిరోధించుటకు గాంధిమహాత్ముడు ఉపవాసమారంభించెను. అంతట, ఆ సంఘములమధ్య పూనాలో సమాఖ్యజరిగి, అప్పటినుండి హరిజనులయుద్ధరణకు, వారియస్పృశ్యతను నివారించుటకు, సవర్ణహిందూనాయకులందరు ప్రమాణముచేసిరి. ఈరీతిగ, సర్కారు క్రూరతవల్లను, భారతీయులలోని విభేదములవల్లను, హరిజన సమస్య ప్రాముఖ్యమువల్లను, సత్యాగ్రహము 1934 నాటికి అంతరించినది.

1934 నవంబరులో కేంద్రశాసనసభఎన్నికలు జరుగవలసియుండెను. అప్పటిదేశస్థితినిబట్టి కాంగ్రెసువారు శాసనసభల ఎన్నికలలో పోటీచేసి, సభలలో పనిగూడ సాగించుట అవసరమని డాక్టరు అన్సారిమున్నగు కొందరునాయకు లభిప్రాయపడిరి. శాసనసభాకార్యమంతగా కార్యకారికాదని గాంధిగారివలె మౌలానాఅజాదుగారును ఎంచిరి. కాని, ఆయనయు గాంధిమహాత్మునివలె కాంగ్రెసువారు శాసనసభ్యులగుటకంగీకరించెను. అప్పుడు జరిగిన కేంద్రసభ ఎన్నికలలో సామాన్యస్థానములకు కాంగ్రెసువారు పోటీచేయగా అందుచాలవరకు, కాంగ్రెసు వారుగెల్చిరి.

# 9. కాంగ్రెసు పార్లమెంటరీబోర్డు.

తరువాత 1935 సం॥లో వచ్చినకొత్తరాజ్యాంగ ప్రకారం, 1937 సం॥ ఆరంభమందు ఆయాప్రాంతములశాసనసభలకెన్నికలుజరిగెను. ఈయెన్నికలలో కాంగ్రెసువారును పాల్గొనవలెనని, 1936 ఏప్రిలులో జవాహర్లాలుగారి అధ్యక్షతను లక్నోలోజరిగిన మహాసభలో కాంగ్రెసు తీర్మానించినది. ఆ ప్రకారం దేశమంతటను కాంగ్రెసుసిద్ధాంతముల ప్రచారము సాగించి, తగు అభ్యర్థులను కాంగ్రెసుతరపున నిర్ణయించుటకు కాంగ్రెసుపార్లమెంటరీబోర్డు ఏర్పడినది అందులో అబుల్ కలాం అజాదుగారు నొక ముఖ్యసభ్యులు. మహమ్మదీయులలో అన్ని వర్గములవారికిని ఈయనయందు విశేషగౌరవము; కనుక, ముస్లిములకు సంబంధించు ప్రత్యేకవిషయము లాయననిర్ణయప్రకారమే జరుపనిశ్చయింపబడినది. ఈవిషయమున మౌలానా అజాదుగారు ప్రత్యేకకృషి చేసిరి. మహమ్మదీయులలో విద్యయు పరిజ్ఞానమును హిందువులకున్నంతయు లేదు. వారికాయాప్రాంతపుభాషల జాతీయపత్రికలజదువు అలవాటులేదు. ముస్లిములలో వివిధపక్షము లేర్పడి కలతలులేకుండుటకు ఒకేజాతీయ పక్షమును తానునడపింతునని జనాబు జిన్నాగారప్పుడు ప్రచురించిరి. ఆయన యిదివరలో కొంతకాలము కాంగ్రెసుసభ్యుడై యుండెను. ఆయన ముస్లిములీగుపక్షపు నాయకుడై, దేశమం

దు ఆలీగుతరపున అభ్యర్థుల నియమించెను. ఆయనప్రచురణ నమ్మి ముస్లిములలో అనవసరమగుకలతలు లేకుండుటకై, చాల స్థలములలో కాంగ్రెసువారభ్యర్థుల బెట్టలేదు; కొన్నిస్థానములకు మాత్రముపెట్టిరి. ఎన్నికలైనమీదట అన్నిప్రాంతాలలోను హిందువుల స్థానములలో చాలవరకు కాంగ్రెసువారేగెల్చిరి. అందువల్లహిందువులధికసంఖ్యగనున్న 6 రాష్ట్రములఅసెంబ్లీలలో కాంగ్రెసుకే మెజారిటీయేర్పడినది. (అస్సాములోమాత్రము అవ విజనులుమున్నగువారి ప్రతినిధులుండినందున, అక్కడ మెజారిటీ లేదు). వాటిలో కాంగ్రెసువారు మంత్రిత్వమువహించుప్రశ్న వచ్చినది. క్రొత్తఆక్టుప్రకారం రాష్ట్రాలలోను మంత్రులకు నిజమైన అధికారంలేదు; గవర్నరుగారిక్షిష్టమైనపుడడ్డుగావచ్చును; అట్లు సాధారణముగా కల్పించుకోమని జూనులో సర్కారు మాటయిచ్చిరి. కనుక 1937 జూలై నుండి హిందువులు హెచ్చు సంఖ్యగల 6 రాష్ట్రాలలో కాంగ్రెసు మంత్రివర్గము లేర్పడినవి. కాంగ్రెసువారా రాష్ట్రపాలనలో చాలసమస్యల పరిష్కరింప వలసివచ్చినది. కార్యసంఘసభ్యులగు ఆజాదుగారందుకుతోడ్పడిరి. ముస్లిములవిషయమున అవలంబించుపద్ధతులగూర్చిప్రత్యేక సమస్యలేర్పడినవి. ముస్లిముల కుద్యోగములు, విద్య, సామాన్య భాషనేర్పాటు, అందులలిపి, అనేకకారణములవల్ల గల్గుసాంఘిక సంఘర్షణములు, ఇట్టివాటిచర్చలో మౌలానాఆజాదుగారిసలహా కాంగ్రెసుపాలకవర్గమునకు అమూల్యమైనది. ఈపాలనపద్ధతిని

సవ్యమార్గమునను ఆయారాష్ట్రములమధ్య విభేదములేకుండను, సాగించుటకు 3 సభ్యుల పార్లమెంటుకమిటీని కాంగ్రెసు కార్యసభవారేర్పర్చిరి.

అందులో సభ్యులగు, వారు శ్రీవల్లభభాయి పటేలు, రాజేంద్రప్రసాదు, మౌలానా అబుల్‌కలాంగారును. వారు ముగ్గురును ఆలోచించి కాంగ్రెసుపాలనను రాష్ట్రీయప్రభుత్వములకు సంబంధించిన చాలముఖ్యసమస్యలను వెంటవెంటనే పరిష్కరించుచుండిరి. ఇందులో గొప్పపరిజ్ఞానము చాతుర్యమును కావలెను. మహమ్మదీయ ప్రశంసగల యావత్తువిషయములు అజాదుగారి సూచనప్రకారమే పరిష్కారమగుటకు నిర్ణయమైనది. తరువాత, వాయవ్యసరిహద్దురాష్ట్రంలోను అస్సాంలోను కూడ కాంగ్రెసుమంత్రిత్వ మేర్పడి, అక్కడి ముఖ్యసమస్యల అజాదుగారే పరిష్కరించుచుండిరి. ఇందుకుతోడు, తక్కినరాష్ట్రములందును మౌలానా అజాదుగారికి చాల శ్రమనిచ్చు కార్యము తగిలినది. ముస్లిములు హెచ్చుమందిగనున్న తక్కిన 3 రాష్ట్రములలో కాంగ్రెసుమంత్రిత్వములేదు. కాని, అక్కడ ముస్లిములీగువారును. హెచ్చుసంఖ్యగ రాలేదు. అక్కడ మిశ్రితమంత్రివర్గములేర్పడినవి. ఈలోగా ముస్లిములీగు నియంతయగు జిన్నాగారు జాతీయభావముల నసలేవదలి, కేవలం సాంఘికస్వలాభమునే తమ ఆదర్శముగ పెట్టుకొన్నారు. అందువల్ల అక్కడపరిస్థితులు క్లిష్టముగ పరిణమించినవి. కాంగ్రెసులోనే

## రాష్ట్రపతి మౌలానా ఆజాద్.

కొందరు సాంఘికతత్వపువారుండి హింసాధోరణి చూపుటవల్ల, కేవలం సాంఘికధోరణిగల సంఘసభ్యులు కాంగ్రెసులో నుండకూడదని మౌలానా అజాదు జవాహర్లాలు నెహ్రూ మున్నగు కాంగ్రెసు అధికారులునిర్ణయించిరి. అంతట, యిదివరలో కాంగ్రెసుసభ్యులైనను ముస్లింలీగుసభ్యులైన చౌదరీఖలీఖుజ్జమాన్ వగైరాలు కాంగ్రెసునువిడచి, శాసనసభలలోను బయటను కాంగ్రెసుకు వ్యతిరేకప్రచార మారంభించిరి. అందువల్ల మౌలానా అజాదుగారు చాల జాగ్రత్తతోను చాతుర్యముతోను వర్తించి, ఆయాప్రాంతములందేర్పడిన సమస్యల నెంతోయుక్తితో పరిష్కరించుచుండిరి.

---

# 10. కాంగ్రెసు అధ్యక్షత.

కాంగ్రెసువారు కొన్ని రాష్ట్రముల పాలించుటచే జనులలో జాతీయత వ్యాపించినది. కాని, కొన్ని బ్రిటిషుపత్రికలును బ్రిటిషు రాజనీతిజ్ఞులును అల్పసంఖ్యాసంఘముల కన్యాయము జరుగుచున్నదని అపవాద మారంభించి, కాంగ్రెసువ్యతిరేకులకు ప్రోత్సాహ మారంభించెను. ప్రత్యేకనియోజకపద్ధతివల్ల శాసనసభలలోను బయటను సంఘర్షము హెచ్చినది. ఈలోగా కేంద్రప్రభుత్వములో క్రొత్తచట్టము ప్రకారం ఫెడరల్ (సమిష్టి) పద్ధతిని రాజ్యాంగము మార్చవలసియుండెను. అందుకు ప్రజాశక్తి బలపడి బ్రిటిషుసామ్రాజ్యమును లొంగదీయుటకై ఈదేశమందు హిందూమహమ్మదీయులకు మైత్రికావలసియుండెను. కాని, బ్రిటిషువారు కూటనీతితో కులతత్వపుద్వేషంతోనున్న ముస్లిములీగుకు మద్దతునిచ్చిరి; ఇట్లే స్వదేశసంస్థానములలో కొన్ని హిందువులవని కొన్ని ముస్లిములవని విభేదములు పెట్టిరి; సంస్థానప్రజలకు నామరూపములు లేకుండ, అచ్చటి రాజులకు నిరంకుశత్వము ప్రోత్సహించిరి; వారికే ఫెడరల్ ప్రభుత్వములో సభ్యత్వమిచ్చి, ప్రజాయత్తత నణచివేయజూచిరి. అందువల్ల హిందూముస్లిము సంఘములమధ్య స్నేహము గల్గించి, ముస్లిము ప్రముఖుల అనుమానములు పోగొట్టు ఉదారుడగు ముస్లింనాయకుడు ప్రస్తుతం జాతీయమహాసభయగు

కాంగ్రెసు కధ్యక్షుడుకావలెను. అందుకు మౌలానా అజాదు గారే సర్వవిధముల తగినవారు. కనుక, ఆయన 1939 మార్చిలో జరుగు కాంగ్రెసు కధ్యక్షుడుగనుండవలెనని గాంధిమహాత్ముడు వగైరా నాయకులు కోరిరి. కాని, మౌలానా అజాదు గారందుకొప్పుకోలేదు. ఆయన పేరుప్రతిష్ఠలకు ప్రాకులాడడు, సరికదా, తాను ప్రాముఖ్యముకు వచ్చుటకిష్టపడని సౌమ్యుడు, వినమ్రుడు, సాత్వికభావుడు, రాజకీయ కోలాహలములోబడక, ఆత్మసాధనకు, లోకసంస్కృతిపరిశుద్ధికినే నిరంతరము కృషిచేయదలచును. కనుక, ఆమారు కాంగ్రెసు కిరీటమునప్పుడు నిరాకరించెను. దేశావశ్యకతనుబట్టి అంగీకరింపవలెనని, కాంగ్రెసు కర్ణధారుడగు గాంధిమహాత్ముడు 1938 ఆఖరున తొందర చేసినను, తనకు స్వస్థముగాలేదని, ప్రస్తుతపు పార్లమెంటరీ కమిటీభారములోనే తనశక్తి వినియుక్తముకావలెనని చెప్పి, తప్పుకొనెను. అప్పుడాయన అధ్యక్షత కంగీకరించితే, గతసంవత్సరపు దేశస్థితి మరొకరీతిగనుండి యుండును. కాని, ఆయన ససేమిరా యని నిరాకరించగా, కాంగ్రెసుకార్యసంఘములో హెచ్చుమంది డా॥ శ్రీ పట్టాభి సీతారామయ్యగారి నధ్యక్షతకు సూచించిరి. అందుకు శ్రీసుభాసబోసు పోటీచేసెను. దేశదౌర్భాగ్యమున కాంగ్రెసులోనే విభేదములు కావేషిలు పెరిగినవి. కొందరు కుడిపక్షము వామపక్షముఅనిపెట్టి, నాయకులపైన అసంతృప్తిగలవారిని చేరదీసిరి. ఆసాలు యెన్నికలో శ్రీ పట్టా

భిగారికన్న శ్రీ సుభాసబోసుకే హెచ్చువోట్లు వచ్చుట సంభ వించినది. ఇది కొన్ని ప్రత్యేక కారణములవల్ల కలిగినది. ఉభయులు దేశసేవకులగు నాయకులే. ఈ యెన్నికఫలితము తెలియగనే, గాంధిమహాత్ముడు ఇది తనకే ఓటమియనెను. ఇది గాంధిగారి వినయస్వభావమునే తెల్పును. కాని శ్రీ సుభాసుడు ఆయన అనుచరులుకొందరును నిజముగ ప్రజాభిప్రాయము గాంధిసిద్ధాంతముకు వ్యతిరిక్తము తమకనుకూలము అని భ్రమించిరి; ఇది అసత్యమని దేశము గాంధిగారినే అనుసరించుచున్నదని, 1939 మార్చిలో జరిగిన కాంగ్రెసుమహాసభలోను, మే నెలలో జరిగిన అఖిలభారతకాంగ్రెసు కమిటీసభలోను తేలినది. సుభాసుగారు తృప్తికరమగు కార్యసభ నేర్పర్చుకోలేక, అధ్యక్షతను వదులుకొనిరి. అప్పుడును మౌలానా అజాదుగారధ్యక్షతకు కోరబడిరి. కాని అస్వస్థతవల్ల నిరాకరించిరి; కనుక శ్రీ రాజేంద్రబాబు అధ్యక్షుడైనాడు.

అప్పటినుండి దేశములో క్రమంగా పరిస్థితులువిషమమగుచున్నవి. కాంగ్రెసుకు ముస్లిములీగుకు సమాఖ్య జరుగుటకు చేసిన ప్రయత్నములు శ్రీ జిన్నాగారి పట్టుదలవల్ల విఫలమైనవి. కేంద్రములో ఫెడరలు రాజ్యాంగముపెట్ట సర్కారు యత్నించిరి. దేశీయరాజ్యములలో ప్రజాయత్త ప్రభుత్వము లేర్పడి కేంద్రసభలలో సంస్థానములకిచ్చిన స్థానములకు అక్కడి ప్రజాసభలెన్నుకొను ప్రతినిధులే సభ్యులయ్యెడల, కొంత

చిక్కువదలును. కాని, అందుకు బ్రిటిషుసర్కారును వారి చేతి కీలుబొమ్మలు స్వార్థపరులునగు సంస్థానరాజులు నొప్పుకోలేదు.

ఈచిక్కు స్థితిలోనే 1939 సెప్టెంబరులో జర్మనీకిని బ్రిటిషు ఫ్రెంచిరాజ్యములకును మహాయుద్ధ మారంభించినది; బ్రిటిషువారు తమబంధుకోటియగు సామ్రాజ్యపు 'డొమిని యను, రాజ్యములతో ముందుగా సంప్రతించిరి; ఐరిషురాజ్యము తటస్థముగనున్నది; తక్కిన సామ్రాజ్యము జర్మనీతో యుద్ధ ముకు దిగినది.

ఈకాలంలో, యుద్ధమును దిగుటవల్ల దేశపుఆర్థికాది స్థితులు తారుమారైపోవును. కనుక, మనదేశపు ప్రజాప్రతిని ధులనుగూడ ముందుగ సంప్రతించుట న్యాయము. కాని, మన దేశము బ్రిటిషువారి నిరంకుశపాలనలో నున్నది. కనుక, సంప్ర తింపులేకుండ, మనదేశమునుగూడ తమతరపున యుద్ధమును దింపి, ధనజనాదులను యుద్ధయజ్ఞమున దాహుతి చేయనారం భించిరి. 'అదేమి'యని కొందరడుగగా, 'మేము పోలండుస్వాతం త్ర్యము నిలువబెట్టి, హిట్లరుదౌర్జన్యమునుండి దానిని రక్షింప బోదుము; లోకక్షేమముకే ఈయుద్ధము' అనిరి. "అట్లైన, మా కునిష్టమే; జాతుల స్వాతంత్ర్యము మీసామ్రాజ్యములోను ఉండునా ? మాదేశ మిప్పుడు మీ నిరంకుశపాలనలోనుండి నానాబాధల బడుచున్నది. కనుక, ఈయుద్ధాంతమందైన మా దేశమునకు ముక్తియిందురా ? ఆసంగతి నిప్పుడు తేటపరచి

పైనైనమట్టుటకు మాకధికార మిచ్చినచాలు, మాశక్తి కొలది మీకు సాయముచేతుము” అని కాంగ్రెసుకార్యసంఘమువా రనిరి. కాని బ్రిటిషుసర్కారు అందుకొప్పుకోలేదు. “పోలండుకై తాము చెప్పు శ్రీరంగనీతులలో కొన్నిటినైనను దానికన్న ఎన్నియోరెట్లు పెద్దదై బాధపడు తమవశములోనున్న యీదేశమునకు అమలుచేయలేము; కనుక, బ్రిటిషువారు తమసామ్రాజ్యబలముకొరకే యీయుద్ధ మారంభించి, మరల నందు కుపయోగించుచున్నారు; కనుక, అందు పాల్గొనకూడదు” అని కాంగ్రెసుమంత్రివర్గములు పరిపాలనను 1939 అక్టోబరులో వదలుకొన్నవి. దేశములో మరల బ్రిటిషు నిరంకుశత నిరాఘాటముగ సాగుచున్నది. చాలమంది సామ్యవాదులు జాతీయ సేవకులు అరెస్టుఅయి నిర్బంధముల పాలగుచున్నారు.

సామ్రాజ్యపు హింసాతత్త్వము చెలరేగుచున్నది. జాతీయత నరికట్టుటకు అల్పసంఖ్యాసంఘాలను ముస్లిములను కూడ దీసి కాంగ్రెసు వ్యతిరేకులుగ జేసి బుజ్జగించుటకు పెద్ద పాతాళహోమము జరుగుచున్నది. జాతీయవాదు లీపద్మవ్యూహము నెట్లో భేదింపవలెను. కనుక, ఈస్థితిలో ఈ సాలుకాంగ్రెసు కధ్యక్షుడై ముందు జాతీయకార్యక్రమము నడుపుటకు సర్వవిధముల నబుల్ కలాం గారే తగుదని గాంధిగారు సూచించిరి; నాయకులకోరిక నీసారి మౌలానాగారు త్రోసివేయలేకపోయిరి. ఇప్పటి చట్టముప్రకారం మంత్రివర్గముకు రాష్ట్రాలలోను

సంపూర్ణాధికారము లేదు. కనుక, కాంగ్రెసువారు మంత్రివర్గము సాగించుట దేశస్వాతంత్ర్యమునకు సాధకము కాదని అట్టిస్థితిలో తా నధ్యక్షుఁడగుట ధర్మమని, ఇదివరలో ఆజాదుగారు భావించిరి. కాని ఇప్పుడు కాంగ్రెసువారు రాజ్యాంగపు మంత్రిత్వము వదలినారు. మరల జాతీయసమర మారంభించవచ్చును. దేశము విషమస్థితిలో నున్నది. కనుక, అధ్యక్షస్థానము కభ్యర్థియగుట కాయన యంగీకరించిరి. 1923 డిశంబరులో కాకినాడ కాంగ్రెసుకు మౌలానా మహమ్మదాలీయు, 1927 లో మద్రాసు కాంగ్రెసుకు డాక్టరు అన్సారీయు, అధ్యక్షులైరి. తరువాత మరల ముస్లిములు అధ్యక్షులు కాలేదు. కనుక ఈసారి మౌలానా ఆజాదుగారి నేక కంఠముగ నెన్నుకోదగియుండెను. కాని, ఎం. ఎన్. రాయిగారు † పోటీ చేసినారు. మౌలానాగారు గాంధిపక్షీయులు. రాయిగారు ఇదివరలో విప్లవవాదులు, మొదట బాంబువిప్లవములలో పాల్గొని, అంతట అమెరికా, జర్మనీ, చైనా మొదలగు దేశములలో చాల విప్లవముల సాగించిన క్రాంతివాది. ఉభయులును దేశమునకు సంపూర్ణస్వాతంత్ర్యము 'ముఖమల్ ఆజాదీ', కావలెననువారే. అయితే వారిధోరణిలోను నైతికోద్దేశములలోను భేదమున్నది. మౌలానాగారు మనోవాక్కాయములనూ అహింసావాది. ఆయన వర్గసమన్వయము నిర్మాణకార్యక్రమము వృద్ధిచేసి, తద్ద్వారా దేశాభ్యు

† పూర్తి పేరు మానవేంద్రనాథరాయి. ఈయన అసలుపేరు నరేంద్రనాథభట్టాచార్య, ఈయన బంగాళీబ్రాహ్మణవంశీయుఁడు.

దయము గల్గింపవలెననును; ఆయన నీతికి ఆస్తికతకు ప్రాముఖ్య మిచ్చును కాని, రాయ్‌గారు పామరజనులకు కూలీలకు రాజ కీయముగా తీవ్రోద్దీపనగల్గించి, సమ్మెలు, ప్రతిష్టంభములు సాగించి, సామంతరాజులను జమీందార్లను, కోటీశ్వరులను తొలగించి, వారిఆస్తులను సీదాగా నిర్బంధముగ లాగుకొని, వర్గసంఘర్షముద్వారాక్రాంతిగల్గించి, బ్రిటిషువారిని దేశమునుండి లేవగొట్టవలెనని, పుంజీపతుల తొలగింపవలెనని, వాంఛించును; వామపక్షీయుడైనను, కాంగ్రెసు సామ్యవాదపక్షముకు ఈయ నకు కొన్ని భేదములున్నవి. ఎట్లైననేమి, తుదకు ది 15-2-1940 తేదీని అన్నిరాష్ట్రములలో నెన్నిక జరిగి, అన్నిటిలోను మౌలానాఅజాదుగారికే హెచ్చువోట్లువచ్చినవి. శ్రీ రాయి గారికి మొత్తం 187 వోట్లుమాత్రం రాగా, మౌలానాఅజాదు గారికి 1854 వోట్లు వచ్చినవి.

ఇట్లు సుమారు పదిరెట్లు హెచ్చువోట్లుతో మౌలానా అజాదుగారు ఈసాలు కాంగ్రెసుఅధ్యక్షులుగ ప్రజలచే నియ మింపబడిరి. (బెంగాలు, ఢిల్లీలలోమాత్రం కాంగ్రెసు ప్రతి నిధుల యెన్నిక సకాలంలో జరుగనందున వారియెన్నికలో వోట్లీయలేదు. అక్కడి పాతసభ్యులలో హెచ్చుమంది బోసు పక్షీయులు. తమపక్ష మీయెన్నికలో తటస్థముగనుండునని, శ్రీ సుభాసబోసుగారు ప్రకటించిరి. మరియు వారివోట్లన్నియు రాయిగారికిచ్చియుండినను మౌలానాగారికే గెలుపుతప్పదు.

ఈయెన్నికవల్ల కొన్నిసంగతులు స్పష్టమైనవి. దేశము గాంధిగారి నాయకత్వమును, అహింసాసిద్ధాంతమును, వర్గసమ న్వయమును వరించుచున్నదని తేలినది. వర్గసంఘర్షమును హింసాశస్త్రమును యీదేశమునకు సరిపడదని, విశదమైనది. హిందువులు స్వజాత్యభిమానులని, ముస్లిముల కన్యాయము చేతురని కొందరు ముస్లిములు బ్రిటిషువారు ననుట కలదు. అది నిజముకాదని, గుణసామర్థ్యములబట్టి మహమ్మదీయులను హిందువు లాదరించి అధికారమిచ్చుట కభ్యంతరముండదని, వెల్లడియైనది. కాంగ్రెసుప్రతినిధులలో హిందువులే ముస్లిములు కన్న చాలరెట్లు హెచ్చుమంది. అయినను, హిందువులగు రాయిగారికన్న మహమ్మదీయమత నిష్ఠుడగు మౌలానాఅజాదు గారికే పదిరెట్లు హెచ్చువోట్లువచ్చుట గొప్పవిశేషము. ఎం. ఎన్. రాయిగారు అసాధారణ ప్రజ్ఞ వ్యక్తిత్వము ప్రచార శక్తియుగలవారు; ఆయనతో పోటీలో అజాదుగారికిట్లు అఖండ జయముగలుటబట్టి రెండుసంఘములమధ్య అసలులో మిత్ర త్వమేకలదని వ్యక్తము. నిర్మాణకార్యక్రమము నాదరించి పోషించు అబుల్ కలాముగారికి వచ్చినవోట్లనుబట్టి దేశమునకు నిర్మాణకార్యక్రమమవసరమని ప్రతినిధులు గుర్తించిరనియు చెప్పవచ్చును. రాయిగారు కేవలం సాంఖ్యవాది, ఈశ్వర విశ్వాసములేనివాడు, అజాదుగారు కేవలం ధార్మికుడు, ఆస్తి కుడు, మహాభక్తుడు; ఈ ఆధ్యాత్మికభేదమునుబట్టియే జీవిత దృక్పథములోను వారిమధ్య భేదము హెచ్చినది.

# 11. రామఘర్ కాంగ్రెసు.

మనదేశపు జాతీయమహాసభ 1885 లో ఆరంభించినది. ఇప్పటికి 52 కాంగ్రెసు వార్షికసభలు జరిగినవి; ఈసాలుది 53 వది. మనభారతదేశముకు గ్రామములే ప్రాణము; కనుక, గాంధిగారి సలహాప్రకారం 4 ఏండ్లనుండి, కాంగ్రెసుమహాసభ చిన్నగ్రామములలోనే జరుపబడుచున్నది.

మొదటిగ్రామకాంగ్రెసు 1936 సం॥ డిసెంబరులో శ్రీజవాహర్లాలుగారి అధ్యక్షతను మహారాష్ట్రప్రాంతపు ఫెయిజ్‌పురంలోజరిగినది. రెండవది 1938 ఫిబ్రవరిలో శ్రీ సుభాసబోసు అధ్యక్షతను గుజరాతు ప్రాంతపు హరిపురమందైనది. మూడవది మహాకోసలపు త్రిపురిలో బోసుగారిఅధ్యక్షతను 1939 మార్చిలో నెరవేరినది. ఈ 4 వ గ్రామకాంగ్రెసు రామఘురులో మౌలానాఅజాదుగారి అధ్యక్షతను 1940 మార్చి 19, 20 తేదీలలోజరిగినది.

ఈరామఘురు అనే ప్రాంతము బీహారురాష్ట్రపు తూర్పుభాగములోని హజారిబాగుజిల్లాలోనున్న ఛోటానాగపురసంస్థానములోనిది. దీనిప్రస్తుతపు జమీందారులు రాజా కామాక్షనారాయణసింహుడను క్షత్రియ యువకుడు. రామఘురు 17 వ శతాబ్దిలో నీసంస్థానపురాజధానియై గొప్పదుర్గముగనుండెను. కాని, తరువాతరాజధాని యిక్కడనుండి

మారగా, ఇప్పుడు చిన్నగ్రామముగనున్నది. ఇది గంగకు దక్షిణ
మగు దామోదరనదీతీరమందున్నది. ఈప్రాంతమంతయు
కొండనేల; చుట్టుపట్ల గిరులు అడవులు, దగ్గరనే బొగ్గు అభ్ర
కము వగైరాల గనులున్నవి. ఈజిల్లాలో నున్నంత ఖనిజ
సంపద మనదేశమందింకెక్కడను లేదని చెప్పవచ్చును. కనుక
పారిశ్రామిక నాయకులగు 'టాటా'గారి వ్యాపారసంఘము
గొప్ప లోహకర్మాగారమును దీనికి కొద్దిమైళ్ళ దూరములో
నున్న 'సాక్చి'లో కట్టినారు. ఆకుగ్రామమిప్పుడాపరిశ్రమచే లక్ష
జనుల మహానగరమై 'జంషెడ్పూర' మనబడుచున్నది. ఇంతటి
లోహకర్మాగార మాసియాలోను బ్రిటిషుసామ్రాజ్యములో
కూడ ఇంకెక్కడను లేదట.

ఈరామఘురుచుట్టు ప్రకృతిదేవిపుష్పగిరివ్రజములనుంచి
నది. ఈప్రదేశము వృక్షములతో కలకలలాడుచు సుందరముగ
శోభిల్లుచుండును. ఇట్టి ప్రకృతిపరిస్థితులలో కాంగ్రెసునగరము
నిర్మించి, దానికి 'మఝుర్పుర' మని పేరుబెట్టిరి.†

మామూలు ప్రకారం కాంగ్రెసుకంగముగ గొప్పస్వదేశి
ప్రదర్శనము పెట్టినారు. ఇందు రకరకములచక్కని ఖదరుబట్టలు

† కాంగ్రెసు జరిపింప నిర్మించుపురము కొకజాతీయనాయకుని పేరు
పెట్టుటరివాజు. ఇదివరలో బిహారురాష్ట్రములో మఝురుల్ హక్ అను గొప్ప
ముస్లిం నాయకుడు జాతీయవాదియై ప్రజాసేవ చేయుచుండెను. ఆయన
కీర్తిశేషు డాయెను. ఆయన కీపేరుస్మారకము.

చిత్రవిచిత్రమగు చేతిశిల్పపువస్తువులు ప్రేక్షకులరంజింపజేయు చు, భారతీయప్రజ్ఞకు, కళలకు, ఆర్థికసంపన్నతకు నిదర్శనము గనున్నవి. ఈప్రదర్శనమును మార్చి 14 వ తేదీని గాంధిమహాత్ముడు ప్రారంభించెను. "మనదేశమునకు గ్రామములే ప్రాణము. ఖదరువగైరా గ్రామపరిశ్రమలు దేశమందటను అభివృద్ధిపొందవలెను; అప్పుడే దేశముకు నిజమైన ఆర్థికస్వాతంత్ర్యమును రాజకీయస్వాతంత్ర్యమునుగూడ లభించును; కనుక ప్రజాక్షేమము కోరు జనులందరును గ్రామపరిశ్రమలను వృద్ధిచేయుటకు, వాటి నేవాడుటకు, కృషిచేయవలెను. సాంఘికజీవితములో ఖదరువగైరా గ్రామపరిశ్రమలకే ప్రాముఖ్యముండవలెను." అని మృదుమధురవచనములతో ఆయన ఉద్బోధించినారు.

మరునాడు (15-3-40 తేదీని) ఉదయముకు భావి రాష్ట్రపతియగు మౌలానా అజాదుగారితరనాయకులతో కలసి కలకత్తానుండి దయచేసిరి. వెంటనే స్టేషనునుండి ఆయనను అప్పటిరాష్ట్రపతియగు శ్రీరాజేంద్రప్రసాదుగారిని మయూరరథములో నెక్కించిరి. పలురంగుల మనోహరమగు పుష్పవృక్షములమధ్య సూర్యునిస్వర్ణకాంతి ప్రసరించుచుండ మూడు మైళ్ళు ఉత్సవము జనులకానందకరమైనది. నాయకులు, ప్రతినిధులు వాలంటీర్లు, ప్రేక్షకులు, ఆప్రాంతపు ఆదిమజనులు, ఇట్టి వివిధకేతుల స్త్రీపురుషులతో నాకుటీరనగరము నిండిపోయినది. ఈసారి మౌలానాగారి అధ్యక్షత హిందూముస్లిము మైత్రికి

స్వాతంత్ర్యసాధనకు శుభసూచకము; మొగలులకాలపు శిల్పకళా యౌన్నత్యమును దెల్పుగోపురముతో ముఖద్వారము నిర్మించిరి. మనదేశమందేగాక లోకమంతటిలో ఉత్తమప్రభువై లోకోత్తరపాలకుడై సర్వమాన్యుడై అహింసావ్యాపకుడైన అశోకచక్రవర్తికీర్తి స్తంభమును స్మరింపజేయు శిలాస్తంభము. కాంగ్రెసురంగము కలంకారమై, భారతీయసంస్కృతికిని జాతీయాభివృద్ధికిని అహింసాధైర్యములే మూలాధారములని స్ఫురింపజేయుచుండెను. ముఖద్వారమువద్ద 30 అడుగుల యెత్తున సుందరముగ నిర్మించిన ఆశిలాస్తంభపు అగ్రమున గొప్పజాతీయధ్వజమును నిలువబెట్టి, దానిపైన 19-3-1940 తేది ఉదయమున శ్రీ మౌలానా అబుల్ కలాంగారు జాతీయపతాకమును ప్రతిష్ఠించిరి, అప్పుడు నెహ్రూ, పటేల్, పట్టాభి మున్నగు తక్కిననాయకులు పదివేలజనము వచ్చియుండ వందేమాతరం గీతమును ఝండాగీతమును పాడినమీదట, జాతీయధ్వజపు ప్రాముఖ్యము, దానిఆదర్శచిహ్నమును గూర్చి, సముచితముగ శ్రీ మౌలానాగారు ఉపన్యసించిరి.

కాని,మహాసభ సాయంకాలముకూడు వేళకుముందే ఆకాశము మేఘావృతమై ఉరుములు మెరుపులు ప్రత్యక్షమైనవి. కుంభవృష్టిగల్గి సభాస్థలి జలమయమైనది. సాయంసంధ్యలో విప్రులచే గీర్తింపపడు వరుణదేవుడిట్లు వర్షరూపముగ సభ్యులకు ప్రత్యక్షమగుటవిచిత్రము. రానున్న సంఘర్షమునిదిసూచించును,

ప్రతినిధుల యోరిమి నీశ్వరు డిట్లు పరీక్షించెననికొందరియూహ. ఇట్లు సకాలముకు సమావేశము జరుగకున్నను, పిమ్మట సభ సాగించిరి. సూక్ష్మముగ తమస్వాగతోపన్యాసము నిచ్చుచు. "ఈసారి కాంగ్రెసు జరిగించు బీహారురాష్ట్రము ఆరంభమందు విదేహారాజ్యము, తరువాత జరాసంధుని మగధరాజ్యము; ఇందే, బుద్ధమహావీరు లవతరించి, వారును వారిముఖ్యశిష్యులును ఈప్రాంతమును పవిత్రము చేసిరి. ఈప్రాంతమందు పూర్వము ప్రజాస్వామ్యపురాజ్యములుండెను. తరువాత మగధసామ్రాజ్యము వెలసెను. భౌతికసంపత్తులోను మాప్రాంత మితరప్రాంతములకన్న గొప్పది. ఆధునికకాలమందును గాంధిమహాత్ముడు మనదేశమందు మొదటి సత్యాగ్రహము నీరాష్ట్రమందే సాగించి, జయమొందెను. కాంగ్రెసువారు విధించుకార్యక్రమము సాగించుటకు మేము సంసిద్ధులము. ప్రజాప్రతినిధులలో ఐకమత్యము, శ్రద్ధ, క్రమశిక్షణయుంటే, తమసంస్కృతిని రక్షించుకొంటే, అట్టివారి నెవరును జయింపలేరని పూర్వము బుద్ధదేవు డీప్రాంతములో చేసినఉపదేశము నేటికిని వర్తించును." అని శ్రీ రాజేంద్రప్రసాదుగారు హెచ్చరించిరి.

అంతట అధ్యక్షుడగు శ్రీ మౌలానా అజాదుగారు నల్లే హిందుస్తానిలో తాము వ్రాసిన అధ్యక్షవక్తృతను మహాసభలో సూక్ష్మముగ వినిపించిరి. యుద్ధమారంభించినప్పటినుండి బ్రిటిషు ప్రభుత్వమువారికి కాంగ్రెసుకు జరిగినచర్చను క్రోడీకరించి,

మనదేశమునకు సంపూర్ణ స్వరాజ్యమే అవసరమని,అందుకు నిర్మా
ణకార్యక్రమము అహింసాయుద్ధమునే సాధనములని, సాంఘిక
కలహములవల్ల అన్నిసంఘములకును నష్టముకలుగుచున్నదని
ముస్లిముసంస్కృతి వృద్ధికిని జాతీయతయే మార్గమని, చక్కని
హేతువాదముతో నిరూపించిరి. †

ఆయుపన్యాసము జనులందరని, ముఖ్యముగ మహమ్మ
దీయులందరని, దేశసేవకు ప్రేరేపించుచు, శ్రీ మౌలానాగారి
కార్యదీక్షకు, ఉదారభావమునకు, నిదర్శనమైయున్నది.

ఈసారి కాంగ్రెసులో ఒకే ముఖ్యమైనతీర్మానము చేసినారు.
"భారతీయులకు సంపూర్ణస్వరాజ్యమే పరమావధి. ప్రస్తుతము
యూరపులో జరుగు యుద్ధమునకు (1914 లోని యుద్ధమువలె)
తమసామ్రాజ్యమును బలపర్చుకొనుటే బ్రిటీషువారి ముఖ్యో
ద్దేశము. అహింసాపద్ధతిని పోరి స్వాతంత్ర్యమును సంపాదించు
కొనుటకు భారతీయులుసిద్ధమై నిర్మాణకార్యక్రమము నింకను
సాగించవలెను. గాంధిమహాత్ముని చూపుమార్గ మనుసరించ
వలెను." అని దీనిసారాంశము. ఈతీర్మానమును శ్రీ జవాహ
ర్లాలు నెహ్రూగా రుపపాదించగా శ్రీ కృపాలినీగారు సమర్థిం
చిరి. మరునాడు ఉదయమున జండాచౌకు నెదుట ఏబదివేలజనుల
యెదుట మహాసభ జరిగినది. సవరణలన్నియుపోయి, అసలు

† ఆయధ్యక్షోపన్యాసపుసారము తెలుగులో యిందలి తుది యధ్యా
యమం దీయబడినది.

తీర్మానము అత్యధికులగు ప్రతినిధులచే నంగీకరింపబడినది. అంతట గాంధిమహాత్ముడు క్రమశిక్షణ కార్యదీక్షకలిగి, ఇంకను చురుకుగ నిర్మాణకార్యక్రమము సాగింపుడని, అట్లు దేశము త్వరలో తయారుకావలెనని, ఆమీదనే సత్యాగ్రహము వెలగునని, ప్రబోధించెను. పిమ్మట, అధ్యక్షులగు మౌలానా గారు గాంధిమహాత్ముడు సూచించుప్రకారము జనులందరు నాచరించవలెనని హెచ్చరికతో సభను పూర్తిచేసినారు.

# 12. ఆజాదుగారి స్వభావము.

మౌలానాఅజాదుగారిప్పుడు 52 ఏండ్ల వయస్సువారు. ఈయన అసలు దృఢశరీరులు, ఆరోగ్యవంతులు; అయినను నిరంతరవిద్యావ్యాసంగి కార్యదీక్షాపరులు, చాలసారులు జైలులో బాధపడినవారు. కనుక, ఇటీవల కొంచె మనారోగ్యముగ నున్నారు. ఈయనకు చక్కని ముఖవర్చస్సుకలదు.

ఈయనస్వభావమునుగూర్చి యిదివరలో కొంత చెప్పబడినది. ఈయన యెవరిని యెప్పుడును బాధించియు దూషించియు యెరుగరు. ఈయన సర్వమాన్యుడు. మనోవాక్కాయములందు కేవలం అహింసాపరుడు; తనను సమీపించువారి కెప్పుడును మంచిసలహాలిచ్చి ప్రోత్సహించి, సహాయము చేయుటే ఆయనకు పరమసంతోషము. ఆయన వేషభాషలును కేవలం నిరాడంబరముగనుండును. సత్యశౌచముల నాయన జాగ్రత్తతో మతధర్మమువలె నిర్వర్తించును. మౌలానాగారు మహావిద్వాంసుడు; ఈదేశమందేగాక, ఈజిప్టు అరేబియా ఇరాను వగైరా ముస్లిముదేశములంతటను ఈయన ప్రఖ్యాతి అపారము. ఈయనతండ్రియగు మౌలానామహమ్మదు ఖైరుల్దీనుసాహెబుగారు గొప్ప ధార్మికుడై అరబ్బీలో ప్రసిద్ధగ్రంధలేఖకుడై 1908 లో కీర్తిశేషుడాయెను. పితామహుడగు మౌలానామహమ్మదు మునవరుల్దీనుగారు గొప్ప మతగురువు.

ఇట్టి పండితవంశపు అబుల్ కలాంగారు విద్వాంసుడు, ధార్మికుడు నగుట సహజమే † ధార్మికసేవకు జాతీయసేవకు సమన్వయము చేయుట ఆయన జీవితపు ప్రత్యేకవిశేషము. తనపత్రికలద్వారాను, స్వయంగా యువకులకు బోధించియు. జాతీయోత్సాహము నాయన మనదేశంలోను ముస్లిముదేశాలన్నిటిలోను వృద్ధిచేయించినారు; పటుత్వముగల్గి భావాన్వితమగు నవ్యశైలిని సృజించి, హిందూస్తానీ రచనలో విప్లవకర్తయై, లేఖకులకు మార్గదర్శకుడైనాడు. అరబ్బీపారసీలలోను ఈయన గొప్పగ్రంథకర్త. మౌలానాగారు జ్ఞానియేగాక కర్మపరుడు; ఉదయం 5 గంటలకేలేచి, సకాలమును తనకార్యము లెప్పుడును నిర్వర్తించుకొనును. ఈయన మహాధార్మికుడు, నాయకులలో ఇంతటి మతనిష్ఠ, ధార్మికత్వము, నిశ్చలభక్తిగలవారు, మతగ్రంథములందు అపారపాండిత్యముగలవారు అరుదు. మహమ్మదీయమతవిషయములగూర్చి సంప్రదాయచర్యలలోను, కురాను షరియతు వాక్యార్థనిర్ణయములోను అన్నిదేశాలవారును మౌలానాఅబుల్ కలాంగారిఅభిప్రాయము ప్రమాణముగ నెంచుదురు. అన్నిదేశములనుండి సందేహపువిషయముల తీర్మానము కీయనకు తెలుపుచుందురు.

మౌలానాఅజాదుగారి కెందరో ముస్లిములు ప్రత్యేక శిష్యులు. సాలీనా 'ఈద్' ఉత్సవములలో కలకత్తాలో జరుపు

† అజాదుగారి పూర్తిపేరు అబుల్ కలాం ఫిరోజ్ బక్స్ అహమ్మదు మొహియుద్దీను; కాని సంగ్రహనామమే వాడుకలోనున్నది.

ప్రార్థన లీయనయే జరిగించును. ఈయనను ముఖ్య 'ఇమాము' (అనగాస్థానాచార్యులు)గా ముస్లిములందరు నేర్పర్చుకొన్నారు. ఈయన వక్తృత అద్భుతమైనది. ఆయన శైలిలో భావగుంభనము, విషయచర్చ, కార్యకారణ సమన్వయము ఉత్సాహశక్తి వాగ్ధోరణి, మనోహరమై, శ్రోతలను స్తంభితులుగ జేయును. కనుక, ఈయన యుపన్యాసమునకు జనులు వేలవేలుగ జేరి, కిక్కిరిసియుందురు. కాని, ఈయన వీలైనంతవరకు మిత్రులమధ్య చర్చల కిష్టపడును, మహాసభలలో నుపన్యాసముల తప్పించుకొనజూచును.

ఆజాదుగారి జాతీయతనిష్కళంకము. 'ఆజాదు'అను పేరు అరబ్బీలో స్వతంత్రుడను అర్థమిచ్చునుగదా! అది ఆయన కన్నివిధములను సార్థకము. మతవిషయములందాయన గొప్ప సంస్కర్త. ఇస్లాములోని అసలుప్రమాణగ్రంథముల వ్యాఖ్యానముద్వారా అందలి పరిశుద్ధసిద్ధాంతమునకు రామమోహన దయానంద వివేకానందాదులు చేసినరీతి సేవ చేసెను. ఆభావములను జనులలో వ్యాపింపజేయుటకాయన చేసినంతకృషి నింకెవరును చేయలేదు. ఉపనిషత్తులలోను భగవద్గీతభాగవతములోగల సిద్ధాంతములు కురానులో నున్నట్లాయన ఋజువుచేసినాడు. ఢిల్లీలోని 'జమయతుల్ ఉలేమాహిందు' ముస్లిం మత సంఘములన్నిటిలో గొప్పది. అది హిందువులకున్న భారత ధర్మ మహామండలివంటిది. కాని, దానివలెగాక, ఉలేమా

సంఘము ఉదారమై ధర్మపరిశుద్ధికి జాతీయక్షేమమునకై కృషి చేయుచు,హీనజనుల నుద్ధరించయత్నించుచున్నది. ఇందుకు చాల వరకు మౌలానా ఆజాదుగారే కారకులు. ఇప్పటికిని జమియతుల్ ఉలేమా వారి కార్యక్రమము ఆజాదుగారి సలహాల ననుసరించి జరుగును

అబుల్ కలాంగారు బాల్యమందే విద్వాంసుడు ప్రాజ్ఞుడునై నందున, యువకుడుగనున్నప్పుడే ఆయన అఖిలభారత ముస్లిములీగు కధ్యక్షుడైనాడు. ఖిలాఫతు చర్చలకును ఆలీ సోదరులతో పాటు ఆయన నాయకత్వము వహించెను. అప్పుడు చాలమంది ముస్లిములు జాతీయవాదులగునట్లాయన చేయగలైరు. కాని తరువాత దానిని ముస్లిములలో పుంజీపతులు,జమీందారులు, సంస్థాధిపతులు, మితవాదులందరును, వశపర్చుకొనిరి. ఆలీసోదరులు జిన్నావగైరాలు కాంగ్రెసునుండి విడిపోయి, కేవలము సాంఘికతత్వము ప్రచారముచేయుచు, విభేదములకు కారకులైరి. అప్పుడజాదుగారు ముస్లిములీగుతో సంబంధము వదలుకొని; దేశము విదేశాధికారమునుండి విడుదలయైనప్పుడే, భారతసంఘము బాగుపడును; సాంఘికంగాను ధార్మికంగాను మనకున్నతిగల్గును; ఈసూత్రము హిందువులకే గాక ఈదేశపు ముస్లిములకును వర్తించునని ఆయన నిదర్శనములతో కనబర్చినారు. ఇంతే కాక, లోకమంతటి ముస్లిమ్ప్రజలు బాగుపడి వృద్ధియగుటకును ఇక్కడి ముస్లిములు జాతీయవాదులు

కావలెనని ఆయనవాదను. ఈజిప్టు, ఇరాకు, పారసీకమువగైరా ముఖ్యముస్లిందేశములపైన బ్రిటిషువారి ఆర్థికరాజకీయ ప్రాబల్యము చాలహెచ్చుగనున్నది; ఇది సాలీనా యింకను హెచ్చుచున్నది. బ్రిటిషుసామ్రాజ్యము భల్లూకపుపట్టునుండి ముస్లిము దేశములను విడిపించుటకును భారతీయముస్లిములు సహకారముచేయవలెను. భారతదేశము స్వతంత్రమై బ్రిటిషు సామ్రాజ్యమునుండి విడినప్పుడే, బ్రిటిషువారి ప్రాబల్యము తగ్గును. ఆంగ్లసామ్రాజ్యపు విపరీతబలము తగ్గినప్పుడే, ముస్లిము రాజ్యములు ధైర్యవంతులై, బ్రిటిషుప్రభుత్వపు అన్యాయపుషరతుల నిరాకరింపగలరు. అప్పుడే ముస్లిములందరికి నిజమగు స్వేచ్ఛయుండును.

మానవసోదరత్వమును దేశభక్తిని, ప్రజాసేవను జనులలో వ్యాపింపచేయుట కాయన యెప్పుడును కృషిచేయుచుండును. ముస్లిములలో నిట్టిభావముగల్గుట మనదేశక్షేమము కత్యవసరము. కనుక, ఆకృషికాయన దీక్షవహించి, అందుకు నిరాడంబరముగ యత్నించుచుండును. జిన్నావగైరాలను జాతీయతవైపుకు త్రిప్పుటకాయన లోగోపున నెంతయో ప్రయత్నించినారు. కాని, సాంఘికైక్యమును జిన్నాగారుకలసి రాక, తుదకు ప్రభుత్వమువారి యాకర్షములకులోనై, గర్వమై, వికటించుట జనులకు తెలిసియేయున్నది. కాని ఇప్పుడు ఆజాదుగారి కృషివల్ల జాతీయవాదులైన ముస్లింవర్గములును చాల

యున్నవి. కాంగ్రెసులోనే వేలకొలది ముస్లిములున్నారు; పైగా, జమయతుల్-ఉలేమా-హింద్, అహరారులు, అఖిల భారతషయాసంఘము, మోమనుమహాసంఘము, ఇట్టివెన్నియో అబుల్‌కలాముగారి నాయకత్వమును బోధలను అనుకరించును. అనగా జాతీయముస్లిము పక్షములన్నిటికిని అబుల్‌కలాంగారే మార్గదర్శకుడగు నేత. జాతీయముస్లిముల మహాసభ నొక దానిని త్వరలోనే శ్రీమౌలానా అజాదుగారి అధ్యక్షతను ఢిల్లీలో జరిపించుటకు కృషిజరుగుచున్నది.

అబుల్‌కలాంగారు మహాత్యాగి; ఆయన సుమారు 20 సంవత్సరములనుండి కాంగ్రెసు వర్కింగుకమిటీ సభ్యులై, సదా దేశ సేవాపరుడైయున్నాడు. ఆయన తలచుకొని యొప్పుకొంటే, జిన్నాప్రభృతులాయనను తమపక్షపు ప్రముఖుడుగ జేయుదురు. నిజాంప్రభువు నవాబు లాయనను గౌరవించియుందురు. శ్రీమంతులాయనను కుబేరునిగ జేయగలరు. సర్కారువారా యనకు గౌరవబిరుదములను మహోద్యోగములను ఇచ్చి సన్మానింతురు. కాని, పవిత్రమగు తనసిద్ధాంతముల మానుకొనుట కాయన యెన్నడును ఒప్పుకోడు. ఆయన బీదవాడు, కాని ద్రవ్యాశ లేకుండ దరిద్రనారాయణసేవయే మహాధర్మముగ నెంచుకొని, మహాత్ముని కుడిభుజముగ మానవసేవచేయుచు న్నాడు. అధ్యాత్మిక మోక్షమును రాజకీయమోక్షముగూడ జను లందరికి సిద్ధింపజేయుటకే, దనజీవితసర్వస్వ మర్పించుచున్నాడు.

అజాదుగారు ఆయాసంఘములమధ్య సమన్వయము చేయుటలో నేర్పరి. 1923 సం॥ ఢిల్లీస్పెషలుకాంగ్రెసులో స్వరాజిస్టుపక్షముకు, గాంధిపక్షముకు, రాజీద్వారాసమన్వయము చేసెను. 1939 సం॥ త్రిపురీకాంగ్రెసులో అధ్యక్షుడగు శ్రీ సుభాసబోసుగారు జబ్బుపడి, అవశుడై యుండెను. అప్పుడు గాంధిపక్షముకు కాంగ్రెసుసామ్యవాదిపక్షముకు మధ్య సమన్వయించి, ఆమహాసభ నంతను అధ్యక్షుని ప్రతినిధిగ అజాదుగారే నడిపినారు. లక్నోలో షియాసున్నీలమధ్య ముస్లింగ్రంథపఠన సంప్రదాయముగూర్చి చాలనెలలు తీవ్రకలహము కల్గినది. ఆసమస్యను తక్కిన ముస్లిమునాయకు లెవరును పరిష్కరించలేకపోయిరి. అంతట ఉభయపక్షములకోరికపైన మౌలానా అజాదుగారే ఆసమస్యను నేర్పుతోను శాంతముతోను పరిష్కరించినారు. ఇటీవల, పంజాబు కాంగ్రెసుసంఘపుపక్షములమధ్య చిరకాలముగనున్న తగువుల నాయన రాజీచేసి, మైత్రి గల్గించినారు. ఇట్లే, బెంగాలులోను ఇంకా యితరప్రాంతాలలోను కలుగు కలహములను నివారించుచున్నారు. హిందూముస్లిములమధ్య మైత్రియుండే ఆయనకు పరమప్రీతి. హిందూమహాసభ 'శుద్ధి' సంఘటన' కార్యములు, ముస్లిములీగు 'తంజీమ్, తబ్లిగు, కార్యములు, చేయుచు తరుచు పరస్పరం ఢీకొనుచున్నవి. వీటి అన్నిటికి బదులు 'జాతీయసంఘటనమే' ప్రశస్తమని ఆయన బోధించియున్నాడు.

# 13. అధ్యక్షోపన్యాసము.

[రామఘరుకాంగ్రెసులో 19-3-40 తేదీని జరిగిన మౌలానాఅజాదుగారి అధ్యక్షోపన్యాసపు సారమిాక్రింద నీయబడినది.]

## లోగడస్థితి.

1923 లో, ఈజాతీయమహాసభకు మీరు నన్నధ్యక్షు నిగజేసియుండిరి; 17 ఏండ్లలోనే మరలచేసినారు. ఇప్పుడు లోకము తీవ్రంగా మారుచున్నది. ఈ 17 ఏండ్లలో ఎన్నియో అంచెలుదాటినాము. కొన్నిచోట్ల ఆగినాము, కాని ఎక్కడను అసలేనిల్చిపోలేదు; మనము పరిస్థితులలో చిక్కుకోలేదు; ఈప్రయాణంలో హానివృష్టు లేవివచ్చినను, మనగమ్యమువైపే దృష్టిపెట్టుకొన్నాము. ఎన్నడూ సందేహించలేదు. మన కెన్నియో కష్టములేర్పడి, ఒకప్పుడు నడక మందగించినా, ముందుకే పోవుచున్నాము.

1923 లో, మనగమ్యమెంతో దూరమైనట్లుతోచి, అదృశ్యముగనుండినది; ఇప్పుడో, సరిగాచూచితే, దగ్గరనే కనబడు చున్నది. అయితే, ప్రస్తుతం మనయాత్రలో దగ్గరమైనకొలది పోరాటపుచిక్కులు హెచ్చుచున్నవి. యుక్తమార్గమున నడచితే గమ్యముచేరుదుము; తప్పుదారిబట్టితిమా, కొత్తచిక్కులలోబడుదుము. ఇట్టి క్లిష్టస్థితిలోనన్నిుంకయుంచి నాకీగౌరవపద

వినిచ్చినందుకు మీకు కృతజ్ఞుడను. ముందు నా బాధ్యత నిర్వర్తించుటలో మీయందరిసాయము కోరుచున్నాను.

## నాజీ ఫాసిస్టు పక్షములు.

ఇక, 3-9-1939 తేదీని యుద్ధములోదిగినమీదట మన మవలంబించినచర్య యెట్టిది? దానిచే నిప్పుడేస్థితిలోనున్నాము? ఇదే యిప్పుడు మనముఖ్యసమస్య. 1936 లో లక్నో కాంగ్రెసులో అంతర్జాతీయస్థితినిగూర్చి గొప్పతీర్మానము జేసితిమి. తరువాతసాలీనా కాంగ్రెసువారట్టిభావము నే ప్రతిపాదించుచున్నారు. ప్రపంచమందిపుడెన్నియో ముఖ్యవృత్తాంతములు జరుగుచున్నవి. అన్యోన్యసామీప్యము హెచ్చినది. ఒకప్రాంతపు భావతరంగములు వెంటనే లోకమంతటను వ్యాపించును. విదేశస్థితివల్ల మనలోను, అట్లే మనచర్యలవల్ల విదేశాలలోను, పరిణామము కలుగుచుండును. కనుకనే ప్రజాతంత్రతను వ్యక్తిస్వేచ్ఛను విరోధించు 'ఫాసిజము'ను 'నాజీజము'ను మనతీర్మానాలలో ఖండించియున్నాము. ఈ రెండుఉద్యమాలు దినదినవృద్ధిజెంది లోకక్షేమమునకు భంగకరమగుచున్నట్లు తోచియే, వీటిని విరోధించు ప్రజాతంత్రతాదులపైన మనసానుభూతి నిదివరలో చూపియున్నాము.

## సామ్రాజ్యతత్వము.

కాని, ఈకొత్తయుద్యమాలకన్న నిజంగా బ్రిటిషుసామ్రాజ్యపుతత్వమేలోకప్రజాతుల స్వాతంత్ర్యము కెన్నియోరెట్లు

ఎక్కువహానికరములు. మరియు పై యుద్యమాలోక్షనోయుంటే, బ్రిటిషుసామ్రాజ్యతత్వము మనయింటిని వశపర్చుకొని, మనపైన పెత్తనముసాగించుచున్నది. వారితగువులవల్ల యూరపులో యుద్ధమువచ్చినది. అందులో దాస్యములోనున్న మనము సాయపడజాలము. మనకు స్వేచ్ఛయేర్పడినప్పుడే అందునుగూర్చి నిర్ణయించుకోగలము.

'స్వాతంత్ర్యము మనసహజస్వత్వము; మనకది లేకుండజేయుచున్న బ్రిటిషుసామ్రాజ్యపుతత్వమింకను తనపూర్వసంప్రదాయప్రకారమే వెలుగుచుండుట స్పష్టము. అట్టిసామ్రాజ్యతత్వముకు మనము సాయపడము, అని మనతీర్మానము. 1939 సం॥ ఆగస్టువరకు ఇట్టి యుద్ధతీర్మానముల జేసియున్నాము. అంతట సెప్టెంబరులో యుద్ధపుపిడుగు వచ్చిపడినది.

## రాజ్యాంగపు చట్టము.

1935 లో కొత్తరాజ్యాంగమును మనకంటగట్టినారు. అప్పుడుమనకేదోయధికారమిచ్చివేసినట్లు బ్రిటిషువారు తనుమామూలుప్రకారం లోకుల భ్రమపెట్టినారు. కాంగ్రెసు ఆయన్యాయపురాజ్యాంగమును నిరాకరించినది. కాని, వెంటనే సంఘర్షము లేకుండ, విశ్రాంతికై, రాష్ట్రములలో పాలన నొకపరతుపైన సాగించి చూచితిమి. 11 లో 8 రాష్ట్రాలందు కాంగ్రెసుప్రభుత్వములు చక్కగా పాలించుచుండినవి. అట్లుండుట బ్రిటిషువారికి లాభకరము. మనము నాజీలపద్ధతిని ఖండించియున్నాము.

## డొమినియనులు.

అట్టిస్థితిలోను బ్రిటిషువారు తమప్రాతపద్ధతులు మాన లేదు. సామ్రాజ్యపు డొమినియను ప్రభుత్వములన్నిటితో ముందుగా సంప్రతించిరి; అక్కడి ప్రజాసభలు స్వేచ్ఛతో చర్చించి, తమయభిప్రాయము తెల్పినారు. ఇంగ్లండుకు పొరుగు నేయున్న ఐరిషుప్రభుత్వము తామీయుద్ధములో బ్రిటిషువారికి తోడ్పడము, అల్స్టరు తమకు తృప్తికరంగా పరిష్కరించినతప్ప తటస్థులగుదుము, అని నిశ్చయించినారు. అయినను బ్రిటనులో నెవరును నోరెత్తలేదు. కాని, బ్రిటిషుసర్కారు మనరాష్ట్రప్రభుత్వములను సభలను మాట వరుసకైన పలకరించక, మనదేశ మంతను ఈమహాయుద్ధములోకి దింపివేసినారు. ఇట్లు జరుగు సంగతి ఈదేశీయులకు తెలియనైనలేదు; మనకు త్వరలో డొమినియను స్వత్వంమాత్ర మిత్తుమన్నారు; కాని అదియైనను ఎప్పుడో వారికి తోచినప్పుడే నట ! తరువాత, బ్రిటిషు సామ్రాజ్యపు తత్వమింకను వెల్లడియైనది.

## బ్రిటిషు రాజనీతి.

1914 లో బాల్కనుప్రాంతపుమూల నెక్కడో యుద్ధాగ్నిరవ కన్పడగనే, చిన్నజాతులహక్కుల రక్షింపవలె నని బ్రిటిషు ఫ్రెంచివారలు కేకలారంభించిరి. పిమ్మట విల్సను అధ్యక్షుని 14 సూత్రములు వచ్చినవి. వాటిగతి తరువాతనేమై

వది? ఇంగ్లండు ఫ్రాంసులు జయముతో మదించెను; వారి చర్యా ధోరణివల్ల అసహ్యతగల్గి, ఇటలీలో ఫాసిస్టుతత్వము జర్మనీలో నాజీతత్వము నేర్పడినవి. వీటిని యంత్రపద్ధతి పశుబలమును లోకశాంతికి భంగకరమైనవి. అంతట కొన్ని రాజ్యములు ప్రజాయత్తతకు, కొన్ని నియంతృరాజ్యములకు, ఒరోడ్డపడసాగినవి. ఈ రెండుకక్షులమధ్య బ్రిటిషుసామ్రాజ్యము కొంతకాలము గోడమీాదపిల్లివలెనుండినది. వారిది పైకి ప్రజాయత్తమే. బ్రిటిషుసామ్రాజ్యము కెప్పటికైనను సోవియటురష్యాయే ప్రబల ప్రత్యర్థియని, దానికన్న నాజీఫాసిస్టుల రాజ్యములే తమకు మంచివని, చేంబర్లేను ప్రభుత్వమువా రెంచినారు. బ్రిటిషుప్రభుత్వపుధోరణి లోపాయికారీగ నియంతృరాజ్యములనే ప్రోత్సహించినవి. అంతట వరుసగా అబిసీనియా, స్పెయిను, ఆస్ట్రియా, జెకోస్లవేకియా, ఆల్బేనియాల ప్రజల స్వాతంత్ర్యమడుగంటినది. ఆస్వేచ్ఛావినాశము బ్రిటిషువారి సందిగ్ధపద్ధతిచే కల్గినదే. అంకులఫలితముగ నాజీ జర్మనీ మరీ ప్రబలమైనది. ఇక ఊరుకొంటే, దానివల్ల బ్రిటిషుసామ్రాజ్యపుబలముకు భంగము కల్గే స్థితివచ్చినది. కనుక, ప్రజాయత్తత రక్షణకని ప్రకటించుచు, బ్రిటిషుప్రభుత్వమువారు యుద్ధముకు దిగినారు. ఈ పశుబలపు పోటీప్రదర్శనము లోకకంటకమైనది; బ్రిటిషువారు చెప్పే స్వాతంత్ర్యరక్షణపు పాటలనుమాత్రం లోకులందరు ఆతురతతో విన్నారు.

## కాంగ్రెసువారి ప్రశ్న.

3-9-1939 తేదీని బ్రిటిషువారు యుద్ధం ప్రకటించినారు; 7-9-39 తేదీనే కాంగ్రెసుకార్యసంఘంవారు వార్ధాలో ఈవిషయం చర్చించినారు. ఇట్టిస్థితిలో వారు వెంటనే చర్యతీసుకొన్నను తప్పులేదు. అయినను, కాంగ్రెసు అధికారులు స్థితిగతులన్నీ నిదానముతో ఆలోచించినారు; ఈయుద్ధము సాగించుటెందుకు? ఇందు బ్రిటీషువారిఉద్దేశమేమిటి? అది తెలిసినప్పుడే ఈసాగించు యుద్ధము మనకూ లోకముకూ క్షేమకరమగునో కాదో తేలును. యుద్ధమెప్పుడును వినాశకము, ఘోరము. స్వాతంత్ర్యము, ప్రజాయత్తత, శాంతియు లోకముకు సిద్ధించుటకే ఈయుద్ధముచేయుట నిజమైతే, అవి మనకును వర్తింపవలెగదా. కనుక, ఆయుద్దేశముల స్పష్టపర్చుమని వర్కింగుకమిటీ (=కాంగ్రెసుకార్యసంఘం) 14-9-40 తేదీని విపులమగు తీర్మానమును ప్రచురించినది. ఇందలికోరిక న్యాయ్యము, నిరాక్షేపణీయము. ఈప్రశ్నను మనమే యెత్తినను, ఇది అన్యాయములతో బాధపడు మానవజాతికంతకూ కావలసినది. 25 ఏండ్లక్రిందట ఘోరయుద్ధముసాగి లోకమంతా పెద్ద నరకకూపమైనది. ఇప్పుడంతకన్న ఘోరనరకముకు ప్రయత్నము జరుగుచున్నది. 'చిన్నజాతుల స్వాతంత్ర్యం, సమిష్టి భద్రత, స్వయం నిర్ణయం, నిరాయుధత్వం, జాతి సమితి, అంతర్జాతీయ పరిష్కారం' ఇట్టిపెద్దమాటల ప్రచారంవల్ల లోకులు సమ్మో

హింతులైనారు. కాని. ఫలితమేమైనది? అంతయు స్వప్నమువలె, అబద్ధమైనది. మరలక్షోభ యారంభించినది. వెనుకటి యనుభవమునుబట్టియైనను జ్ఞానము తెచ్చుకోక, కళ్ళుమూసుకొని మనము మహాప్రళయపు వినాశములో బడవలసినదేనా ?

## బ్రిటిషువారి జబాబు.

కాంగ్రెసువారి ప్రశ్నకు బ్రిటిషుసర్కారు కొన్ని జబాబులిచ్చినారు. వీటిలో మొదటి ది 17-10-1939 తేదీని వైస్రాయిగారు ప్రచురించినది. ఇది అయోమయశైలిలోనున్నది. ఈ దీర్ఘప్రచురణను పరిశీలించితే సర్కారు ధోరణి కొంచం వ్యక్తమైనది. వారియుద్ధోద్దేశములు తెలియుటకు బ్రిటిషుప్రధానిగారిచ్చినయుపన్యాసం చూడవలెనట! తీరా దానినికూడా విమర్శించగా, అందులో యూరపుశాంతియు అంతర్జాతీయ సంబంధాల సరిపెట్టుటయు నేయున్నవి. అందులో 'స్వాతంత్ర్యము ప్రజాయత్తత' ప్రశంసయే లేదు. ఇక మనదేశంవిషయమై, 1919 సం॥పు చట్టపు పీఠికలో చెప్పిన ఉద్దేశమే 1935 సం॥పు చట్టములోను ఉంచి, దానినే ఖాయపచ్చినా మన్నారు. ఇప్పటికీ అదేపద్ధతియట ! అంతకన్న అందులో విశేషము లేదు.

అంతట కాంగ్రెసు కార్యసమితివారు 21-10-39 తేదీని మరల సమావేశమైనారు. వైస్రాయిగారిచ్చిన పైజబాబు కేవలంఅసంతృప్తికరమని స్పష్టమే; కనుక ముందుచర్య తేల్చక తప్పదు. 'ఈయుద్ధములో బ్రిటనుకుచేసే సహాయం బ్రిటిషు

సామ్రాజ్యమునుమరింత బలపర్చును. అదికాంగ్రెసు ఉద్దేశముకు విరుద్ధము. కాంగ్రెసు సామ్రాజ్యతత్వమును నిరోధించును; కనుక, అందుకై, కాంగ్రెసుమంత్రులందరు రాజీనామానీయవలెను' అని కార్యసమితి తీర్మానించినది. ఆప్రకారమామంత్రులు రాజీ నిచ్చినారు. తరువాత కొన్ని సంగతులు జరిగినవి. రాజప్రతినిధికీ గాంధిమహాత్మునికీ సంభాషణలుజరిగినవి. తుదకు వైస్రాయి గారు 5 2-40 తేదీప్రచురణ చేసినారు. 'పరిస్థితులబట్టి వీలైనంత త్వరలోనే ఈదేశముకు డొమినియను హక్కునీయవలెనని బ్రిటిషుసర్కారు సంకల్పము;అయితే రాబోవు రాజ్యాంగమును భావిస్థితిని ఇక్కడియెన్నికప్రతినిధులద్వారా ఈదేశమే (ఇతరుల యాటంకములేకుండ) నిర్ణయించుకొనుటను తామొప్పుకోమని ఆయన అంటులో నన్నారు. అనగా మనదేశముకు స్వయంనిర్ణయపు హక్కు ఉన్నదని బ్రిటను ఒప్పుకోదన్నమాట.

'ప్రజాయత్తత, స్వాతంత్ర్యము' అని ఈనాలుగేండ్లు బ్రిటిషు ఫ్రెంచి రాజనీతిజ్ఞులు చెవులు గింగురుమనునట్లరచుచు న్నారు. కాని, క్రియలో అవిలేవు. మనదేశ మీసంగతి ఎత్తగానే, స్వాతంత్ర్యావసరము యూరపుకేనని వారు తేల్చివేసినారు. ఆసియా ఆఫ్రికాల జనులాప్రశంస చేయకూడదట. చేంబర్లేనుగా రీభావమును 24-2-40 తేదీని బర్మింగ్హాముపత్రికలో నింకను స్పష్టపర్చినారు. ఈబ్రిటిషుమంత్రులు చెప్పినవి గత 200 ఏండ్లనుండి యూరపురాజ్యము లన్నిటికినున్న మనోభావ

ములను తెల్పును. 18 వ 19 వ శతాబ్దులలో వ్యక్తులకు జన సంఘములకు స్వాతంత్ర్య ముండవలెనని నిర్దేశించిన సూత్రములన్నిటిని యూరపియనుజాతులకు మాత్రమే వర్తింపజేయుట, అందును క్రైస్తవజాతులకే ఆలాభమిచ్చుట, వారి సంకల్పము. ఇప్పుడు ఈ 20 వ శతాబ్దిమధ్యను చూడగా, గత శతాబ్దిలో చెప్పినవి చేసినవి అంతయు పూర్వకాలచరిత్రమై మాయమైనట్లు తోచును. మానవత్వ ముండవలెనను ప్రచురణ మాత్ర మింకను పోలేదు.

మన జాతీయ స్వత్వముగూర్చి బ్రిటిషు అధికారులు 1917, 1919 లలో అవలంబించిన నీతిని మనము మరువలేము. కనుక, లోకవృత్తాంతములు శరవేగమున ప్రసరించుచున్నందున, 1939 లో బ్రిటిషువారి ధోరణి యెట్లున్నదో తెలుసుకోగోరితిమి. మనదేశమునుగూర్చి బ్రిటిషువారి వెనుకటి ధోరణి, సామ్రాజ్యతత్వపుధోరణి,మారినదా? అని అడిగితిమి. 'లేదు' అనిస్పష్టంగా మనకు జబాబు వచ్చినది.

మనదేశీయులు మన ముందుగతిని నిర్ణయించుట కధికారమున్నదా, అందుకు బ్రిటిషుసర్కారు ఒప్పుకొందురా? అనేదే ఇప్పటి ముఖ్యప్రశ్న. మన జాతీయసమస్య కిదే మూలము. ఇది లేకుంటే జాతీయతయే లేదు.

## ప్రస్తుత యుద్ధము.

ఇక యుద్ధవిషయము. ఇది సామ్రాజ్యబలం నిమిత్తం జరిగే యుద్ధము. ఇందులో బ్రిటిషువారికి తోడ్పడి ఆసామ్రాజ్యముకు జయంగలిగించితే, అందువల్ల బలపడి, మనదేశంపైన ఆసామ్రాజ్యపు ఆధిపత్యమింకను చిరకాల ముండును. ఇట్లు మన దాస్యపరిమితి వృద్ధియగుటకు మన మంగీకరింపము. వారి దారి వేరు, మనదారి వేరు.

ఈయుద్ధమువల్ల మనకు వచ్చిన ఫలితమేమి ? 1937 లో మన మారంభించిన మితసహకారము నిల్పుఅయినది. అనగా మరల అసహకారమార్గము పట్టినాము. ఇక వెనుకకు మళ్ళుట లేదు; ముందుకే పోవలెను.

## సామ్రాజ్యతత్వము న్యాయవిరుద్ధము.

జాతులేవియు, సంఘర్షము వచ్చినప్పుడు, తమ వశమైన రాజ్యములను నిర్బంధంవల్లగాని వదలుకోరు.

వ్యక్తులు నీతితో వర్తించినను, నీతిన్యాయములను అధికారి రాజ్యములు గమనించుటలేదు. యూరపులో నిప్పుడు మానవస్వత్వముల నెట్లు నాశము చేయుచున్నారో స్పష్టమే. హక్కుల నిర్ణయముకు పశుబలముపైనే ఆధారపడుచున్నారు. కాని, ఈ ప్రాతపద్ధతి వ్యర్థము హానికరమునని లోకమంతటను కోట్లకొలది జనులు తహతహలాడుచున్నారు; శాంతి న్యాయముల ఆధారముతో క్రొత్తపద్ధతి కావలెననుచున్నారు.

ఈ ధోరణి మానవుల ఆత్మశక్తిపైన ఆధారపడునది. ఇది క్రిందటి యుద్ధముతో ఆరంభమై వేగంగా బలపడుచున్నది.

ఇట్టి పరిస్థితిలో, ఇంతవరకు పాలకపాలిత సంబంధము గల్గిన బ్రిటిషువారు మనము శాంతి న్యాయపద్ధతులతోనే కొత్త సంబంధ మేర్పర్చుకొనుట అసంభవముకాదు. బ్రిటిషువారందు కొప్పుకుంటే, మానవజాతి కుపకరించి మార్గదర్శకులై యుందురు. కాని, అందుకు బ్రిటిషువారిలో హృదయపరిణామము కావలె. అది యిప్పుడు లేదు.

ఇట్లు లోకము అంధకారబంధురమైయున్నను, మానవ స్వభావము సహజముగమంచిదని గాంధిమహాత్ముని దృఢవిశ్వాసము. సిద్ధాంతభంగము లేని పద్ధతిని, అన్యోన్య సమాఖ్య కెంత యవకాశమున్నను, ఆప్రకార ముపయోగించుకొనుట కాయన సిద్ధముగ నున్నాడు.

ఈయుద్ధము రాగానే బ్రిటిషువారు శాంతిన్యాయముల స్థాపనకే యత్నించుచున్నట్లు వారి ప్రముఖులు ప్రకటించుచున్నారు. ఆభావము నిజమైతే, చాల సంతోషము. కాని, అది అసత్యమని, బ్రిటిషుసామ్రాజ్యతత్వపు శాంతిన్యాయవాదము నేది దొంగనాటకమని, భారతీయసమస్య అనే మచ్చురాయితో పరీక్షించగానే, తేలినది.

ఇదే ముఖ్యసమస్య; తక్కినవన్నియు అనుషంగికములు. ఇందునుగూర్చి బ్రిటిషుసర్కారును కాంగ్రెసువారు మాట

యిమ్మన్నారు. ఆకోరిక అన్ని సంఘములకు నిష్టము, నిరాక్షేపణీయము. కొన్ని పక్షములకు కాంగ్రెసుతో సమంగా ప్రగతిలేక, ప్రత్యక్ష సంగరముకు అవి వెనుదీయుమాట నిజమే. కాని, భారతీయులకు స్వాతంత్ర్యము జన్మహక్కు, అది అవసరము, అని అన్ని పక్షములు అంగీకరించినదే. అట్టి మార్పువల్ల తమ ప్రత్యేకపుహక్కులకు భంగము కల్గునని భయపడేవారును కాలవేగమున వచ్చు స్వాతంత్ర్యసూత్రము నంగీకరింపక తప్పలేదు.

## సాంఘిక సమస్య.

ఈవిషమస్థితి అందరకీ పరీక్షాసమయము. ఇందువల్ల కొన్ని రాజకీయములేగాక. సాంఘికసమస్య నిజస్వభావమును వెల్లడియైనది. సాంఘికసమస్యతో అసలు రాజకీయసమస్యను ముడిపెట్టి, భారతదేశపు రాజకీయసమస్య పరిష్కారముకు మైనారిటీ (=స్వల్పసంఘము) సమస్యయే అడ్డమువచ్చినట్లు లోకులను నమ్మించుటకు, ఇంగ్లండులోను ఈదేశమందును చాలసార్లు ప్రయత్నాలు జరిగినవి. 'విభజించి పాలించుట' మనదేశములో 150 ఏండ్లనుండి బ్రిటిషువా రవలంబించిన పద్ధతియే. పరాధీనులలో విభేదములు హెచ్చించి, వారి కేర్పడు దుర్బలత్వమును తమ లాభంనిమిత్తం విదేశప్రభుత్వ ముపయోగించుకొనుట సహజమే. మనలో విభేదము లున్నంతకాలమే ఇక్కడ విదేశప్రాబల్యము సాగుట సులభము.

కాని, మనదేశములో సామ్రాజ్యతత్వమిప్పు డంత మొందినదని, వెనుకటి కథ అంతా పోయినదని, ఇటీవల బ్రిటిషువారు

అందరినీ నమ్మింపజూచినారు. అదే నిజమైతే, సాంఘికసమస్య ను తమ రాజకీయలాభం నిమిత్త ముపయోగించుకొనే పాడు సంప్రదాయము నిష్పటికైన మానరేల? ఈ 5 నెలల చరిత్ర వల్ల సామ్రాజతత్వ మట్టి నిల్చియున్నట్లు స్పష్టమైనది. మనకు సాంఘికసమస్య యున్నమాట నిజమే; కాని బ్రిటిషురాజనీతిజ్ఞు లు దానిని స్వలాభముకు ఉపయోగించుకొనుట మాత్రం కేవలం అన్యాయము.

ఈసమస్యనుగూర్చి కాంగ్రెసువారిధోరణి స్పష్టమే. సాంఘికసమస్యయున్నదని,అదిముఖ్యమైనదని, అది వెంటనే పరిష్కారం కావలెనని,కాంగ్రెసువారు చెప్పుచునేయున్నారు.కాంగ్రెసుచరిత్ర అంతయు ఇందుకు నిదర్శనము. మనజాతీయాదర్శము చేరుటకు ముందు సాంఘికసమస్య పరిష్కరించవలెనని తెల్పి, కాంగ్రెసువారిందుకు రెండుసూత్రములు నిర్ణయించినారు.

1. ఈదేశముకొట్టి రాజ్యాంగమేర్పడినను, అందులో 'అల్పసంఘము'లన్నిటి హక్కులు భద్రముగ రక్షించుటకు హామీ యివ్వబడును.

2. ఆహక్కులకెట్టి రక్షణకావలెనో, ఆయల్పసంఘము లే నిర్ణయింతురు: అనగా వారిఅంగీకారమునిూదనే రక్షణ నిర్ణయ మాధారపడును.

ఈ 'మైనారిటీ'ల సమస్య' ఇతరదేశాలలోను ఉన్నది. ఆ దేశాలలో నెక్కడను ఈసమస్యకు పైనసూచించిన వాటి

కన్న నెక్కువన్యాయమైన పరిష్కారసూచన యున్నదని యెవ రైన చెప్పగలరా? మనయేర్పాటులో నేమి లోటుకలదు? అందులో లోపములుంటే సవరించుటకు కాంగ్రెసు ఎప్పుడును సిద్ధమే. నేను కాంగ్రెసులో చేరియున్న ఈ 19 ఏండ్లలోను కాంగ్రెసువారి ముఖ్యతీర్మానము లేవియు నాతో సంప్రతింపులేకుండ జరుగలేదు. పైనచెప్పిన సూత్రములు వట్టిమాటలుకావు. అవి కాంగ్రెసువారు నిర్ణయించుకొన్న కార్యక్రమపువే. గత 15 సం॥లలో ఇందు కెన్నియోసారు లగ్నిపరీక్ష కలిగినది. అందు కెప్పుడు నుచలించక కాంగ్రెసు నిలువగల్గినది.

కాంస్టిట్యుయెంటు అసెంబ్లి (=ప్రజాపరిషత్తు) పద్ధతిని గూర్చి కాంగ్రెసువారేర్పర్చిన నియమములు ఇందుకు గొప్ప నిదర్శనములు. ఆ 'మైనారిటీ'లు, (తమకట్లే యిష్టమైతే') తమ ప్రత్యేకపువోట్లద్వారా నే తమప్రతినిధుల నెన్నుకోవచ్చు; అందు కితరులవోట్లక్కరలేదు. తమకు నిర్ణయించే హక్కులును తమ అంగీకారప్రకారమే జరుగును. ఏప్రశ్ననుగూర్చియైన ఏకాభిప్రాయం కుదురకపోతే, అప్పుడు, మైనారిటీసంఘమును ఒప్పుకొనే నిష్పక్షపాతమైన న్యాయసంఘంవారు దానిని పరిష్కరింతురు. బహుశః అందుకవసరమే కలుగదు. ఇంతకన్న సవ్యమైన పద్ధతి నెవరైన సూచించితే, దానినొప్పుకొనుట కభ్యంతరము లేదు.

అట్టిస్థితిలో, 'మైనారిటీ' సంఘసమస్య పరిష్కారం కావలెనని ప్రతిసారి బ్రిటిషురాజనీతిజ్ఞులు మమ్ము హెచ్చరించుటెందుకు? ఈదేశముకు స్వాతంత్ర్యమిచ్చుట కదేయడ్డమైనదని లోకమును నమ్మించుటెందుకు ? బ్రిటిషుసర్కారు మాస్వాతంత్ర్యపుహక్కు నొప్పుకొని 'మైనారిటీ' సమస్యనుఆపైన అన్యోన్యాంగీకారంతో పరిష్కరించుకొనుట కవకాశమీయ రేల ?

ఈవిభేదములు బుద్ధిపూర్వకంగానే పెట్టి వృద్ధిచేయబడుచున్నవి. ఇట్లు మనబంధములు హెచ్చుచున్నవి. మనమార్గములో నిరోధములు కష్టములు నెన్నివచ్చినను, ధైర్యముతో వాటినిదాటి సవ్యపద్ధతిని దాటనిశ్చయించుకొన్నాము.

## ముస్లిముల పొరబాటు.

ఇంతకును, ముస్లిములు స్వల్పసంఘమని తమయుండు స్థితినిగూర్చి భయపడవలెనా ? స్వల్పమైన 'మైనారిటీ'లు అట్లు భయపడుటసరియే. కాని, రాజకీయంగా మహమ్మదీయులు స్వల్పసంఘంవారనుటలో అర్థములేదు. ఈసంగతిని 28 ఏండ్లక్రిందటనే నేను 'అల్ హిలాల్' పత్రికలో నిరూపించినాను. ఇప్పటికిని నాయభిప్రాయమంతే. హిందూదేశము ప్రజాయత్తమైతే తమహక్కులకు భంగముకల్గునని భయపడుటయు అసంబద్ధమే. ఈపొరబాటువల్లనే, ఎన్నియో అనుమానములు, తప్పుహేతువాదములును, జరిగినవి. అందువల్ల ముస్లిములు భ్రమవశులైనారు; ప్రపంచముకును మనదేశపు యథాస్థితినిగూర్చి అపసవ్యపు భావములేర్పడినవి.

కాంగ్రెసువారు జాతీయోద్యమ మారంభించగానే, దానికి ప్రతిక్రియగ బ్రిటిషు ఉద్యోగివర్గమీ విభేదముల బుట్టించు యెత్తుకు సిద్ధమైనారు. 'ఈదేశములోని హిందువులు ముస్లిములు రెండు ప్రత్యేకసంఘములు, కనుక ఏకజాతిలేదు, అందువల్ల జాతీయవాంఛను వర్ణింప వీలులేదు' అని ఒక వాదము పెట్టినారు. మరియు, 'హిందువులకన్న ముస్లిములు చాలకొద్దిమంది, కనుక ప్రజాయత్త ప్రభుత్వము వచ్చేకల్పంలో, ఇక్కడ అధికసంఖ్యయగు హిందువుల పాలనయే కలిగి, ముస్లిములధోగతి పాలగుదురు' అని మరొకవాదమును పెట్టినారు.

ఈయుక్తి క్రొత్తదికాదు; పూర్వంపై ప్రాయియైన డఫరిన్ ప్రభువు, వెనుకటి వాయవ్యపరగణాల పాలకుడైన సర్ ఆక్లండు కాల్విను గార్ల కాలమునుండి యిదివచ్చుచున్నది. ఇట్లు బ్రిటిషుసామ్రాజ్యతత్వ మీదేశంలో విభేదమను విషాంకురమును నాటి పెంచినారు. ఈ 50 ఏడ్లలో అది బాగుగ వేరుబారినది.

## మైనారిటీసంఘు మననేమి.

రాజకీయాలలో, సంఖ్యలో తగ్గినంతమాత్రమున 'మైనారిటీ' సంఘమని, ప్రత్యేకరక్షణ కావలసినదని, అనిపించుకోదు. బొత్తిగా ఆత్మరక్షణకు వీలులేనంత స్వల్పసంఖ్యగల్గి, శక్తిహీనమైనప్పుడే మైనారిటీసంఘు మనబడును. ఒకదేశంలో, ఒకసంఘ మొకకోటి, రెండవది రెండుకోట్లు నున్నంతమాత్రమున, మొదటిది స్వల్పసంఘముగా లెక్కించనవసరము లేదు.

అది దుర్బలము కాకపోవచ్చు ఈసూత్రప్రకారం ముస్లిముల సంగతి చూడుడు. వారు కోట్లకొలదిగనుండి, దేశమంతట వ్యాపించియున్నారు. ఈదేశపు ముస్లిములు 80 కోట్లు 90 కోట్లకు మధ్యనున్నారు. హిందువులు వర్ణాలలోనుండు జాతికుల విభేదములు వారికిలేవు. మహమ్మదీయసంప్రదాయపు సర్వజన భ్రాతృత్వము సమత్వమువల్ల వారిలోనే ఏకీభావమున్నది. వారు మొత్తపుజనసంఖ్యలో $\frac{1}{4}$ వంతే అయినను చాలకోట్ల జనులు బలీయులును; కనుక, భారతదేశము స్వతంత్రము ప్రజాయత్తమునైనప్పుడు, తమహక్కులు రక్షించుకోలేమని ఈ మహాసంఘము భావించుట సత్యమేనా? వారు అన్నిప్రాంతాలలో హెచ్చుతగ్గులుగానున్నారు. మనదేశపు రాష్ట్రాలలో నాలుగింటిలో—బ్రిటిషు బెలుచిస్తాను సహా అయిదింటిలో—ముస్లిములే హెచ్చుమంది; అనగా,అయిదింటిలో తక్కినమతాలవారే అల్పసంఖ్యవారు. కనుక, ఏడింటిలో హిందువులు, ఐదింటిలో ముస్లిములు, హెచ్చు. అట్టిస్థితిలో ముస్లిములు కేవలం అల్పసంఖ్యవారని బాధపడుట కెట్టికారణమూలేదు.

భారతదేశపు భావిరాజ్యాంగము ఫెడరేషను(=సమిష్టి ప్రభుత్వము); అదిప్రజాయత్తముగ నుండకతప్పదు, అందులో, ఆయారాష్ట్రముల కాంతరిక స్వేచ్ఛ యుండును. ఫెడరలు కేంద్ర ప్రభుత్వమునకు, విదేశసంబంధము, దేశరక్షణ, సుంకములు, ఇట్టి అందరికిని అవసరమైన విషయములే సంబంధించును. అట్టి ప్రజాయత్తమైన భావిరాజ్యాంగంలో మెజారిటీ మైనారిటీ

సంఘముల బాధయుండునని శంకింపవీలులేదు. మనము ఈద దలచియు, గట్టుపై నేనిలిచి, నీటిలోదిగుటకుజంకువారి రీతినున్నాము. ఈదుటకు ధైర్యముతో నీటిలోదిగవలెను; అప్పుడనుమానములన్నియు మాయమగును.

## భారతీయ ముస్లిములకు ప్రశ్న.

ఈసమస్యను నేను 1912 లోనే మొదటిసారి ఆలోచించితిని. అప్పటికి (1888 నుండి), ముస్లిములు రాజకీయములలో జేరక, జాతీయతకు వ్యతిరేకులై యుండిరి. అయినను నేను నిదానముతో విమర్శించి, నిశ్చయించితిని. భారతీయులందరము ఒకేపడవలో పోవు ప్రయాణికులవంటివారము. పట్టిపై చర్చలు వ్యర్థములు. మనదేశపు భావిస్థితినిగూర్చి, ముస్లిములము జంకు భయము గల్గియుంటే, మనము వెనుదీసి వేరుమార్గము పట్టదగును. ఆస్థితిలో 3 వ పక్షముగు బ్రిటిషువారిదేశంలో మనరక్షణకై స్థిరంగా ఉంచవలసినదే. మనమట్టి పిరికివారమైతే ముందునుగూర్చి మనకెట్టివాగ్దానములిచ్చినను, రాజ్యాంగరక్షణలిచ్చినను, మనము బాగుపడలేము. ఇట్లుగాక, మనకుధైర్యము ఆత్మవిశ్వాసమునుంటే, మనము మాంద్యము, శంక, అశ్రద్ధవగైరాలను వదలి, ధైర్యవిశ్వాసములతో కార్యరంగమునకు దూకవలెను. ధీరసాహసులు కార్యపరులు నెప్పుడును చెడరు. దారిలో చిక్కులు వచ్చినను, జంకక మనమీదేశపు జాతీయాదర్శము చేరవలసినదే. నాప్రతినాళములను ఈభావమున్నది. ఇస్లాము ధర్మము స్వాతంత్ర్యబోధకము; కనుక, ముస్లిములు

దాస్యము కొప్పుకోకూడదు. దేశదాస్యమును పోగొట్టి, జాతీయస్వాతంత్ర్యము సంపాదించుటకు ప్రతిముస్లిమును సిద్ధపడవలెను. ఇస్లాంధర్మమును వదలువాడే పరాధీనముగ నుండగలడు.

1912 లో నేనిట్టిబోధ కారంభించితి. అంతట కొందరు నాభావముకువచ్చిరి. తరువాత నేను నాలుగేండ్లు జైలులో నుండి వచ్చినాను. అప్పటికి ముస్లిములు తమరాజకీయసిద్ధాంతములు సవరించుకొన్నారు; దాస్యపుగొలుసు త్రెంచదలచినారు. తరువాత ఈ 20 ఏండ్లలో చాలసంగతులు జరిగినవి; కొత్తభావతరంగములు వచ్చినవి. ఐతే, ఏమార్పువచ్చినను ముస్లిములెప్పుడును వెనుకబడుట కిష్టపడరని నాయభిప్రాయము.

## భావి కార్యము.

ఇప్పుడు ముస్లిములు ముందుమార్గమును గూర్చి సందేహములో నున్నారు. ఇటీవల జరిగిన యావత్తు వృత్తాంతములను నేను జాగ్రత్తతో పరిశీలించినాను. నేను వాటిలో పాల్గొన్నాను. అన్నిసందర్భములు గమనించి, ఆత్మవంచనకు లోబడకుండ విమర్శించగా, నేను లోగడ జెప్పినదే సరియని, ఈ దేశపు 9 కోట్ల ముస్లిములును నేను 1912 లో చెప్పిన భావములనే అనుసరింపవలెనని, వేరుమార్గము లేదని, నా దృఢనిశ్చయము. 1912 లో నాభావము లొప్పుకొన్నవారిలో కొందరిప్పుడు వ్యతిరేకించి యున్నారు. వారు మనస్ఫూర్తిగ బాధ్యతతో ఆలోచించవలెనని కోరుచున్నాను. జాతుల భావిస్థితిని

గూర్చిన విషయము, కనుక తత్కాలపు ఉద్రేకముతో గాక, నిదానముగ ఆలోచించుడు. ప్రస్తుతము మేఘములు కమ్మి, అంధకారమయముగ తోచవచ్చు. కాని, నిజస్థితియను కాంతిలో చూడవలెను. అప్పుడు నేజెప్పినదే మార్గమని తేలును.

ఇస్లాంమతపు 1300 ఏండ్ల చరిత్రయు, దానికళలు, వాఙ్మయము, సంస్కృతి, నాకు ప్రత్యేక సంపత్తులు. వాటిని రక్షించుట నావిధి. నాముస్లిం సంస్కృతికి భారతీయతకు సంఘర్షమేమియులేదు; ఆనుకూల్యమే కలదు. నేను భారతజాతిలో నొక భాగముగ నున్నాను. ఈ జాతీయ భవనము నేనులేకుండ సంపూర్ణముకాదు. ఆభావమును వదలుకోలేను.

భారతదేశములో నెన్నియో జాతులు, మతములు, నాగరికతలు ప్రవేశించుట దీనిచారిత్రకవిశేషము. ఈచలువనేల యెందరికో యాశ్రయమైనది. చరిత్రకాలముకు పూర్వమును జనబృందము లక్కడకు తరంగములుగ వచ్చిపడినారు. తరువాత నెందరో వచ్చిరి ఉదారయగు నీమహాదేశ మందరిని తన యొడిలోనుంచి యాదరించి,పోషించినది. గంగా యమునా సంగమమువలె రెండుసంస్కృతిప్రవాహములు కొంతకాలము వేరుగ నుండి, ప్రకృతిశక్తివల్ల పిమ్మట కలసినవి. ఈరెండు అమూల్య సంపత్తుల మిశ్రణమే భారతీయసంస్కృతి. ఇందులో ముస్లిం సంస్కృతిలో ప్రజాయత్తత సర్వజనసమత్వము నున్నవి.

హిందూమత మీదేశమందు చాలవేల యేండ్లనుండి యున్నది. కాని, ముస్లిముమతమును వేయేండ్లనుండి యీదేశమం

మున్నది. హిందువు తాను భారతీయుడననుచు, హిందూమతమను సరించుచుగదా! అట్లే ముస్లిములు తాము భారతీయులమని గర్వపడుచునే, ముస్లింమత మనుసరింపవచ్చు. ఇట్లే క్రైస్తవులు భారతీయుల మనుకొనుచు, ఈదేశపు క్రైస్తవమత మాచరింతురు.

ఈవేయేండ్లలో మనమిశ్రణము కనబడును. మనభాషలు, కవితలు, వాఙ్మయములు, సంస్కృతి, వేషము పద్ధతులు, ఆచారములు, వగైరా లన్నిటిలో సమిష్టికృషి ఫలితము ప్రతిబింబితమైనది. మనభాషలు అసలు వేరుగ నుండినను, ఇప్పుడు సామాన్యభాష వాడుచున్నాము. ఇట్లే ఆచారవ్యవహారాలలోను మిశ్రమమున్నది. పూర్వపువేషములు పాతచిత్రములలోనేగాని ఇప్పుడు వాడుకలోలేవు. ఇట్లొకేజాతి, సమిష్టినాగరికత, కల్గియున్నవి. ఇవి పొమ్మన్నను పోవు. వేయేండ్లక్రిందటి హిందూజీవితమును తేవలెనని హిందువు లెవరైన యత్నించినను, అది యిప్పుడు స్వప్నమువంటిదే యగును. అట్లే ముస్లిములెవరైన వేయేండ్లక్రిందట మధ్య ఆసియా పారసీకములనుండి వచ్చిన సంస్కృతి నిప్పుడు తేబోయినను, అదియు సాధ్యము కాదు. మతవిషయములందప్పుడుపరుద్ధరణ మంచిదే; కాని సాంఘికవిషయమందైతే యిట్టికృషి ప్రగతిని చెరుచును.

ఈవేయేండ్లలో క్రమముగ ప్రకృతియే గూఢముగ మిశ్రమముచేసి, ఏకజాతిని నిర్మించినది. ఇష్టమున్నను కాకున్నను, మనమందర మిప్పుడు అభేద్యమై ఏకమైన భారతజాతియైనాము.

కృత్రిమము భేదించబోయినను, అదియిప్పుడు విడిపోదు. ఈ చారిత్రకసిద్ధి నొప్పుకొని మన భవిష్యత్తును చక్కబెట్టు కృషి చేయుదము.

ఒక తుదిమాట: ఐకమత్యము, క్రమశిక్షణ, గాంధిమహాత్ముని నాయకత్వమందు సంపూర్ణవిశ్వాసము, ఈమూడు నున్నప్పుడే మనకు జయము గల్గును. అందువల్లనే మన యుద్యమ మిదివరలో నున్నతస్థితికి వచ్చినది; ముందును ఆయన నాయకత్వముద్వారానే మనకు జయముతో కార్యసాధన యగును. మన పరీక్షసమయము వచ్చినది. ప్రపంచపుదృష్టి మనపై నున్నది. మన ముందు కష్టాలగుటకు కృషిచేయుదము.

---

సారాజహాన్ సే అచ్ఛా, హిందోస్తాన్ హమారా ।
హమ్ బుల్ బుల్ హైం ఇస్ కీ, యహ్ బోస్తాన్ హమారా॥
మజహబ్ నహీంసిఖాతా ఆపస్ మేం బైర్ రఖనా ।
హిందీ హైంహమ్, వతన్ హై హిందోస్తాన్ హమారా॥
(సర్ మహమ్మద్ ఇక్బల్)

---